# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

LGTV

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్








ప్రచురణ ,తెలంగాణ. సంపుటి : 14 సంచిక : 248, పేజీలు : 12, వెల రూ. 2, /- బుధవారం -08 - జూలై - 2026


## నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం - భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!



- సింధు జలాల వాటా కోసం అన్ని చర్యలు తీసుకుంటామన్న పాక్ సైన్యం
- నీటి కోసం భారత్‌తో యుద్ధానికైనా సిద్ధమంటూ బిలావల్ భుట్టో వ్యాఖ్యలు
- పహల్గాం దాడి తర్వాత సింధు ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్

## ఈ25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన

ఇప్పట్లో ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదని కేంద్రం స్పష్టీకరణ

ఈ25 పెట్రోల్ పై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన



ఢిల్లీ: దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది.

## ఏఐ వినియోగంలో దూసుకెళ్తున్న భారత కంపెనీలు!

కానీ 25 శాతం ఉద్యోగులే ఏఐకి సిద్ధమన్న క్రైండ్రిల్ నివేదిక

ఏఐ వేగాన్ని అందుకునే నైపుణ్యాలు లేవని 81శాతం లీడర్ల ఆందోళన



ఢిల్లీ: భారతీయ కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంలో వేగంగా ముందుకు సాగుతున్నప్పటికీ, అందుకు అవసరమైన నైపుణ్యాలున్న ఉద్యోగుల సంఖ్య మాత్రం ఆందోళనకరంగా తగ్గుతోంది. కేవలం 25 శాతం కంపెనీలు మాత్రమే తమ సిబ్బంది ఏఐని ఉపయోగించుకోవడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నారని ప్రముఖ టెక్నాలజీ సంస్థ 'క్రైండ్రిల్' విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

## సుప్రీంకోర్టులో సీఎం విజయ్‌కు భారీ ఊరట

- విజయ్ విజయాన్ని రద్దు చేయాలంటూ డీఎంకే అభ్యర్థి పిటిషన్
- పెండింగ్ కేసుల వివరాలను దాచారని ఆరోపణ
- తనను విజేతగా ప్రకటించాలని కోర్టును కోరిన వైనం



ఢిల్లీ: కరూర్ తొక్కిసలాట ఘటన కేసులో తమిళనాడు సీఎం విజయ్‌కు ఊరట దక్కింది. కరూర్ తొక్కిసలాటపై బహిరంగ ప్రకటనలు చేయకుండా సీఎం విజయ్, రాష్ట్ర మంత్రి ఆధవ్ అర్జునతో పాటు ఇతర టీవీకే నేతలను నిరోధించాలని కోరుతూ

# డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక పరిపాలన అందిస్తాం

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం -సీఎం
- ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు
- పరిపాలన వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేస్తూ ముందుకెళ్లాలని దిశానిర్దేశం
- డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తిస్థాయి కసరత్తు చేసేందుకు ఒక కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు



హైదరాబాద్, పరిపాలనలో మరింత పారదర్శకత కోసం వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి అవసరమైన మేరకు చట్టాలను రూపొందించాలని చెప్పారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి గారు ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరే విధంగా డిజిటల్ గవర్నెన్స్ అమలు చేయాలని సూచించారు.



ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తారీఖున జీతాలు అందించేలా వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని స్పష్టంగా చెప్పారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా,

## మోదీ నాయకత్వానికి గుర్తింపు.. ప్రధానికి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం

- భారత్, ఇండోనేషియా మధ్య రక్షణ, వాణిజ్యం సహా పలు రంగాల్లో కీలక ఒప్పందాలు
- ప్రధాని మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్ణ' ప్రదానం
- ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయానికి కీలక రక్షణ ఒప్పందంపై సంతకాలు
- సెయిల్, క్రాకటౌ స్టీల్ మధ్య వ్యూహాత్మక జాయింట్ వెంచర్‌కు అంగీకారం



ఢిల్లీ: భారత్, ఇండోనేషియా తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చాయి. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో ఇరు దేశాలు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ చారిత్రక పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీకి ఇండోనేషియా తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపుర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా'ను

## పార్టీ పేరు వివాదం.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత



తన కొత్త పార్టీ పేరు వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత 'టీఆర్ఎస్' పేరుపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎన్నికల సంఘం

## కేటీఆర్ కుమారుడు హిమాన్షుకు స్వల్ప గాయం.. ఆసుపత్రికి కేసీఆర్



- జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా ముక్కుకు దెబ్బ
- హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స
- ఆసుపత్రికి చేరుకున్న కేటీఆర్, హరీశ్ రావు

## విశాఖలో జీసీసీ, మూలపేటలో నాఫ్తా క్రాకర్.. ఏపీలో పెట్టుబడులకు ఎల్జీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం

## దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి లోకేశ్

- ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఎల్జీ కెమ్ ఉన్నతాధికారులతో సమావేశం
- విశాఖలో జీసీసీ, మూలపేటలో నాఫ్తా క్రాకర్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- శ్రీసిటీలో రూ.5000 కోట్లతో ఎల్జీ యూనిట్.. ఈ ఏడాది నుంచే ఉత్పత్తి
- ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన ఎల్జీ యాజమాన్యం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఎల్జీ కెమ్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాలతో సియోల్‌లో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం, శ్రీసిటీ, మూలపేట కేంద్రాలుగా రాష్ట్రంలో భారీ ప్రాజెక్టులు చేపట్టేందుకు గల అవకాశాలను ఆయన వివరించి, పెట్టుబడులకు ఆహ్వానం పలికారు.

విశాఖలో జీసీసీ.. ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు లోకేశ్ ప్రతిపాదనలు

సియోల్‌లోని ఎల్జీ ట్విన్ టవర్స్‌లో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్, ఇండియా సీఈవో హాంగ్ జు జియోన్‌లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్జీ సంస్థ తన నోయిడా, బెంగళూరు ప్రాజెక్టుల తరహాలో విశాఖపట్నంలో ఒక గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా ఇంజనీరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు శ్రీసిటీ,

## ఏపీకి పెట్టుబడుల వెల్లువ.. ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టులు ఇవే!



- ఏపీకి రూ.9,076 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- మొత్తం 11 ప్రాజెక్టుల ద్వారా 10,531 మందికి ఉద్యోగాలు
- రైతు కుటుంబాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం
- పర్యాటక రంగం అభివృద్ధికి 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు
- ఇథనాల్, సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం

## ఇది చూసి నేను షాకయ్యా.. ఇది ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం: మంత్రి లోకేశ్



- రాజమహేంద్రవరంలో ఇసుక లారీల వల్ల దెబ్బతిన్న రోడ్ల సమస్య
- టీడీపీ కార్యకర్త ట్వీట్‌పై స్పందించిన మంత్రి నారా లోకేశ్
- వెంటనే రోడ్డు నిర్మించాలని అధికారులకు తక్షణ ఆదేశాలు
- ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత అని స్పష్టీకరణ

# నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం – భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!

ఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య చారిత్రక సింధు జలాల ఒప్పందంపై వివాదం మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. ఇప్పటివరకు కేవలం రాజకీయ నాయకులకే పరిమితమైన హెచ్చరికలు, ఇప్పుడు పాక్ సైనిక నాయకత్వం నుంచి కూడా వ్యక్తమవుతున్నాయి. సింధు జలాల్లో తమకు న్యాయబద్ధంగా రావాల్సిన నీటి వాటాను దక్కించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పాకిస్థాన్ సైన్యం తీవ్రంగా హెచ్చరించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలను మరింత జటిలం చేస్తోంది. పాక్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అధ్యక్షతన జరిగిన 276వ కోర్ కమాండర్ల ఉన్నత స్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రభుత్వ ఆదేశాలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సింధు జలాల్లో తమ హక్కును కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని సైన్యం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా మళ్లించడాన్ని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని గత ఏడాది ఏప్రిల్ 24న పాక్ జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సీ) చేసిన తీర్మానాన్ని ఈ సమావేశంలో పునరుద్ఘాటించారు. దేశ సన్నద్ధత, వృత్తి నైపుణ్యం పట్ల సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ కూడా భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సింధు నది జలాలను భారత్ ఒక 'ఆయుధం'గా మార్చుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అవసరమైతే భారత్‌తో యుద్ధం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. సైనిక సమావేశంలో ఆఫ్ఘన్ గడ్డపై నుంచి పాక్‌లో జరుగుతున్న ఉగ్రదాడులపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీరీలకు తమ నైతిక, రాజకీయ మద్దతు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. గత ఏడాది పహల్గామ్‌లో 26 మంది మృతికి కారణమైన భీకర ఉగ్రదాడి తర్వాత, దానికి ప్రతీకార చర్యగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ శాశ్వతంగా, విశ్వసనీయంగా స్వస్తి పలికేంత వరకు ఈ ఒప్పందంపై ముందుకు వెళ్లేది లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి వాస్తవాలకు విరుద్ధంగా ఒప్పందాలు ఒంటరిగా మనుగడ సాగించలేవని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్‌పై భారత్‌కు, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌పై పాకిస్థాన్‌కు నియంత్రణ ఉంటుంది. ఒప్పందం నిలిపివేయడంతో, రుతుపవనాల సమయంలో పాక్‌తో వరద సమాచారాన్ని పంచుకోవాలన్న బాధ్యత భారత్‌కు లేకుండా పోయింది. ఇదే సమయంలో భారత్.. సింధు నదీ బేసిన్‌లో సావల్‌కోట్, రాటిల్, బుర్సార్ వంటి పలు జలవిద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. పాకిస్థాన్ వ్యవసాయంలో 80–90 శాతం సింధు నదీ వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. ఆ దేశంలోని ప్రధాన జలాశయాలైన టార్బెలా, మంగ్లా డ్యామ్‌లలో నీటి నిల్వలు అడుగంటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఒకప్పుడు సాంకేతిక ఒప్పందంగా ఉన్న సింధు జలాల అంశం ఇప్పుడు ఇరు దేశాల మధ్య కీలకమైన వ్యూహాత్మక ఒత్తిడి కేంద్రంగా మారింది.

# ఈ25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన

మొదటి పేజి తరువాయి

ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు. ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. అయితే, ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బతినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి. అయితే, ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# ఏఐ వినియోగంలో దూసుకెళ్తున్న భారత కంపెనీలు!

మొదటి పేజి తరువాయి

ఏఐని ఉపయోగించుకోవడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నారని ప్రముఖ టెక్నాలజీ సంస్థ 'కైండ్రిల్' విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2025తో పోలిస్తే ఇది 12 పాయింట్లు తక్కువ కావడం గమనార్హం. మరోవైపు వ్యాపార ప్రక్రియల్లో ఏఐని విస్తృతంగా అమలు చేస్తున్న సంస్థల సంఖ్య 2025లో 36 శాతం ఉండగా, ఇప్పుడు 56 శాతానికి పెరిగింది. ఈ గణాంకాలు ఏఐ వాడకం, ఉద్యోగుల సన్నద్ధత మధ్య అగాధం పెరుగుతోందని స్పష్టం చేస్తున్నాయి. దాదాపు 81 శాతం మంది భారతీయ వ్యాపార నాయకులు, ఏఐ పురోగతి వేగాన్ని తమ ఉద్యోగుల సామర్థ్యాలు, సంస్థాగత పాలనా విధానాలు అందుకోలేకపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే 12 నెలల్లో అటానమస్ ఏఐ (మానవ ప్రమేయం లేని ఏఐ) కీలక నిర్ణయాలు తీసుకుంటుందని 84 శాతం సంస్థలు అంచనా వేస్తుండగా, కేవలం 28 శాతం మాత్రమే మానవ పర్యవేక్షణ లేకుండా పనిచేసే వ్యవస్థలపై పూర్తి నమ్మకం ఉంచుతున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా కంపెనీలు కొన్ని కీలక చర్యలు చేపడుతున్నాయి. భారత్‌లో సర్వే చేసిన సంస్థల్లో 69 శాతం, ఏఐ అమలుకు వీలుగా ఉద్యోగాల స్వరూపాన్ని పునఃరూపకల్పన చేస్తున్నాయి. అలాగే, 33 శాతం సంస్థలు ఉద్యోగులకు నైపుణ్యాలు పెంచేందుకు ప్రత్యేక బడ్జెట్లు, శిక్షణా వ్యూహాలను అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ, పాలన, నమ్మకం, పర్యవేక్షణ వంటి అంశాల్లో పురోగతి నెమ్మదిగా ఉందని నివేదిక పేర్కొంది. ఈ అంశంపై కైండ్రిల్ ఇండియా ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ లింగరాజు సావకర్ మాట్లాడుతూ.. "టెక్నాలజీ వినియోగంలో భారత్ ఎప్పుడూ ముందుంటుంది. సంస్థలు తమ కార్యకలాపాల్లో ఏఐని వేగంగా అమలు చేస్తున్నాయి. అయితే, ఈ సాంకేతికత పూర్తి ప్రయోజనాలను పొందాలంటే వ్యాపారాలు తమ పనివిధానాన్ని పునఃపరిశీలించాలి. ఉద్యోగాల స్వరూపాన్ని మార్చాలి, కొత్త సామర్థ్యాలు నిర్మించుకోవాలి, నమ్మకాన్ని పెంచేలా పటిష్టమైన పాలనా విధానాలను ఏర్పాటు చేయాలి" అని వివరించారు. ఏఐ విజయం అనేది కేవలం టెక్నాలజీ లేదా వ్యూహాలపై ఆధారపడి ఉండదని, పని విధానాన్ని మార్చడం, సంస్థాగత మార్పులను సమర్థంగా నిర్వహించడంపైనే ఆధారపడి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. భారత్‌తో సహా 8 దేశాల్లో 1,100 మంది సీనియర్ బిజినెస్, టెక్నాలజీ లీడర్ల అభిప్రాయాలతో ఈ గ్లోబల్ సర్వేను రూపొందించారు.

# సుప్రీంకోర్టులో సీఎం విజయ్‌కు భారీ ఊరట

ఢిల్లీ: కరూర్ తొక్కిసలాట ఘటన కేసులో తమిళనాడు సీఎం విజయ్‌కు ఊరట దక్కింది. కరూర్ తొక్కిసలాటపై బహిరంగ ప్రకటనలు చేయకుండా సీఎం విజయ్, రాష్ట్ర మంత్రి ఆధవ్ అర్జునతో పాటు ఇతర టీవీకే నేతలను నిరోధించాలని కోరుతూ తమిళనాడు డీఎంకే జనరల్ సెక్రటరీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు అత్యున్నత న్యాయస్థానం మంగళవారం నిరాకరించింది. డీఎంకే జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కరూర్ తొక్కిసలాట ఘటనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లో సీఎం విజయ్ పేరు ఎక్కడా నిందితుడిగా లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఒక ముఖ్యమంత్రి ఎక్కడికి వెళ్లాలి. ఏం మాట్లాడాలి అనే విషయాలను కోర్టులు నియంత్రించలేవు అని ధర్మాసనం పేర్కొంది. న్యాయస్థానాలను రాజకీయ పోరాటాలకు వేదికగా మార్చవద్దని డీఎంకే తరపు న్యాయవాదులకు కోర్టు హితవు పలికింది. కోర్టు వైఖరితో డీఎంకే తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించారు. ప్రస్తుతం ఈ కేసును సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేస్తోంది. అయితే, జూలై 10, 11 తేదీల్లో సీఎం విజయ్ కరూర్‌లో పర్యటించి, మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించనున్నారు. బాధితులే ఈ కేసులో కీలక సాక్షులని, సీఎం విజయ్ పర్యటన వల్ల సీబీఐ విచారణ ప్రభావితం అవుతుందని డీఎంకే తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. కానీ కోర్టు ఆ వాదనలను తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో సీఎం విజయ్ కరూర్ పర్యటనకు, బాధితుల కుటుంబాలను కలవడానికి ఉన్న అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి.

# పార్టీ పేరు వివాదం.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత

హైదరాబాద్: కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ పేరు నమోదుకు సంబంధించి నెలకొన్న వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పేరుకు అనుమతినిచ్చేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించాలని కోరుతూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇవ్వాలని కవితకు సూచించింది. ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోవడం ఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుందని కోర్టు స్పష్టం చేసింది. బీఆర్ఎస్ పార్టీ పాత పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి'ని పోలి 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామం వస్తుండటంతో, దీనిపై జూన్ 23న కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పేరు ప్రజల్లో గందరగోళానికి దారితీస్తుందని పేర్కొన్న ఈసీ, 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కవితను ఆదేశించింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ ఆదేశాలనే కవిత కోర్టులో సవాలు చేశారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత, ఈ ఏడాది ఆరంభంలో సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఏప్రిల్‌లో ఈసీ ప్రాథమిక ఆమోదం తెలిపింది. అయితే, ఈ పేరులోని 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త రూపం పాత పార్టీని గుర్తుచేస్తోందంటూ 1,100కు పైగా అభ్యంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం కవితకు నోటీసులు జారీ చేసింది.

# విశాఖలో జీసీసీ, మూలపేటలో నాఫ్తా క్రాకర్.. ఏపీలో పెట్టుబడులకు ఎల్జీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం

మొదటి పేజి తరువాయి



ఎల్జీ సంస్థ తన నోయిడా, బెంగళూరు ప్రాజెక్టుల తరహాలో విశాఖపట్నంలో ఒక గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా ఇంజనీరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు శ్రీసిటీ, దాని పరిసర ప్రాంతాలలో డిస్‌ప్లే మాడ్యూల్స్, సెన్సర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్ వంటి విడిభాగాల తయారీ యూనిట్‌ను స్థాపించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. రాష్ట్రంలో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు ఐఓటీ, రోబోటిక్స్ వంటి అత్యాధునిక రంగాలలో ఇన్నోవేషన్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రీసెర్చ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో కలిసి పనిచేయాలని సూచించారు. క్యారియర్ సంస్థ తరహాలో వాణిజ్య అవసరాల కోసం చిల్లర్ మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సీఈవో హాంగ్ జు జియోన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత రిఫ్రిజిరేటర్ మార్కెట్‌లో 28 శాతం, వాషింగ్ మెషీన్ల విభాగంలో 33.5 శాతం వాటాతో ఎల్జీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఇప్పటికే శ్రీసిటీలో రూ.5,000 కోట్ల భారీ వ్యయంతో తమ మూడో ఉత్పాదక కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, దీని ద్వారా సుమారు 1,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. ఈ ఏడాది చివరికల్లా ఈ యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించి ఏసీ కంప్రెసర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు తయారు చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మూలపేటలో నాఫ్తా క్రాకర్.. ఎల్జీ కెమ్‌కు ఆహ్వానం

పర్యటనలో భాగంగా లోకేశ్, ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్ బృందంతో కూడా భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేట పోర్టు కేంద్రంగా ప్రపంచ స్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహన రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితో పాటు మూలపేటలో బయో-ఇథనాల్, సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్ఏఎఫ్) ఉత్పత్తిపై దృష్టి సారించి జీవ ఇంధనాల తయారీ కేంద్రం, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెచ్చేందుకు రీసైక్లింగ్, పైరోలిసిస్ ప్లాంట్లను ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి యున్-జు కోహ్ స్పందిస్తూ, గతంలో విశాఖపట్నం గోపాలపట్నంలోని ఎల్జీ పాలిమర్స్ ప్లాంట్ ద్వారా కీలకమైన పాలిమర్ భాగాలను సరఫరా చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం శ్రీసిటీలో ఏబీఎస్ కాంపౌండ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నూతన ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశాలు రాష్ట్రానికి మరిన్ని భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా సానుకూల వాతావరణాన్ని సృష్టించాయని అధికారులు భావిస్తున్నారు.

# మోదీ నాయకత్వానికి గుర్తింపు.. ప్రధానికి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం

మొదటి పేజి తరువాయి



తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపుర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా'ను ప్రదానం చేసి అరుదైన గౌరవాన్ని అందించింది. జకార్తా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. రక్షణ రంగంలో సహకారం ఈ ఒప్పందాల్లో ప్రధానంగా నిలిచింది. సముద్ర భద్రత, భద్రతా సహకారంపై ఉన్న అవగాహన ఒప్పందాన్ని ఇరు దేశాలు పొడిగించాయి. దీనికితోడు, ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను అందించేందుకు ఒక రక్షణ కాంట్రాక్టుపై సంతకాలు జరిగాయి. అదేవిధంగా, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఇండోనేషియాకు చెందిన రిపబ్లికోర్ప్ మధ్య గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణుల సహకారంపైనా ఒక ఒప్పందం కుదిరింది. వాణిజ్య, ఆర్థిక రంగాల్లోనూ వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది పడింది. ఖనిజాలు, ఉక్కు సరఫరా వ్యవస్థలలో సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఇండోనేషియాకు చెందిన పీటీ క్రాకటౌ స్టీల్ మధ్య ఒక వ్యూహాత్మక జాయింట్ వెంచర్ ఏర్పాటు కానుంది. వీటితో పాటు విపత్తు నిర్వహణ, వ్యవసాయం, టెలికమ్యూనికేషన్స్, వైద్య ఉత్పత్తుల నియంత్రణ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై కూడా పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి.

మోదీకి అరుదైన గౌరవం

జకార్తాలోని అధ్యక్ష భవనంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో.. ప్రధాని మోదీకి 'బింటాంగ్ ఆదిపుర్ణ' పురస్కారాన్ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రబోవో మాట్లాడుతూ.. "ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నెలకొల్పే శక్తిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు, ద్వైపాక్షిక సంబంధాలను మార్చడంలో ప్రధాని మోదీ వ్యక్తిగత నాయకత్వానికి ఈ పురస్కారం ఒక గుర్తింపు. మా గణతంత్రం అందించే అత్యున్నత పురస్కారం ఇది. ఇండోనేషియా, భారత్ మధ్య ఉన్న చారిత్రక నాగరికతా బంధాలు, విడదీయరాని వ్యూహాత్మక విశ్వాసానికి ఇది నిదర్శనం" అని ప్రకటించారు. విద్యా, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించే దిశగా ఐఐఎం బెంగుళూరు, పీటీ ఇంటెలిజెన్షియా గ్రహతామా మధ్య ఒక ఎంఓయూ కుదిరింది. అలాగే, ఇండోనేషియాలోని చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ కోసం ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలు ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక పరిపాలన అందిస్తాం

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి గారి దృష్టికి తెచ్చారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1 నుంచి గరిష్టంగా 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. ఈ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలని సూచించారు. నిరంతరం మానిటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి గారు, సలహాదారు కె. రామకృష్ణారావు గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, ఎంఏ-యూడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారు, ఎంసీఆర్ హెచ్ఆర్డీ వైస్ చైర్మన్ శాంతి కుమారి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్ కుమారుడు హిమాన్షుకు స్వల్ప గాయం.. – ఆసుపత్రికి కేసీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు హిమాన్షు రావు ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. నిన్న సాయంత్రం జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా అతడి ముక్కుకు స్వల్ప గాయమైంది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు హిమాన్షుకు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. కుమారుడికి గాయమైందన్న సమాచారం అందుకున్న కేటీఆర్, బీఆర్ఎస్ సీనియర్ నేత టి. హరీశ్ రావుతో కలిసి వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. హిమాన్షు ఆరోగ్య పరిస్థితిపై వారు వైద్యులను అడిగి ఆరా తీశారు. మనవడు గాయపడిన విషయం తెలిసిన వెంటనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా పరామర్శించేందుకు ఆసుపత్రికి బయలుదేరారు.

కోలుకుంటున్నాను: హిమన్షు

తాను కోలుకుంటున్నానని హిమాన్షు 'ఎక్స్' వేదికగా తెలిపారు. చిన్నపాటి గాయం కావడంతో గత రాత్రి ఆసుపత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని వైద్యులు సూచించారని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయమైందని, ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోందని కేటీఆర్ కూడా సామాజిక మాధ్యమ వేదికగా వెల్లడించారు. హిమాన్షు ఆరోగ్యంపై ఆరా తీసిన వారికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఇది చూసి నేను షాకయ్యా.. ఇది ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం: మంత్రి లోకేశ్





అమరావతి: సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిధిలో ఇసుక లారీల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ మహిళా కార్యకర్త జాహ్నవి చేసిన ట్వీట్‌కు స్పందించిన ఆయన, ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరు, మల్లయ్యపేట ప్రాంతాల్లోని రోడ్లు ఇసుక లారీల నిరంతర రాకపోకలతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్లన్నీ గుంతలమయంగా మారి, వాహనాల రాకపోకలతో పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోంది. ఈ దుమ్ము స్థానికుల కళ్లలోకి, ముక్కుల్లోకి చేరి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతోంది. ఈ సమస్యపై టీడీపీ కార్యకర్త జాహ్నవి గత నెలలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లను ట్యాగ్ చేస్తూ ఎక్స్ లో ఫిర్యాదు చేశారు. గత రెండేళ్లుగా ఈ సమస్య గురించి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని జాహ్నవి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు ఎవరైనా ఆ మార్గంలో పర్యటిస్తే మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారని, ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా కూడా అలాగే చేశారని ఆమె పేర్కొన్నారు. సమస్య తీవ్రతరం కావడంతో జాహ్నవి తాజాగా మరోసారి ట్వీట్ చేశారు. తాను మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే, అది గనుల శాఖ పరిధిలోకి వస్తుందని ఆయన చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. దుమ్ము, ధూళి, ప్రమాదాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ ట్వీట్‌పై మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. "ఇది చూసి షాకయ్యాను. ఇది ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం" అని పేర్కొన్నారు. తక్షణమే రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌తో పాటు గనుల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని, దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కేవలం తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ సమస్యపై మంత్రి లోకేశ్ వేగంగా స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో జాహ్నవి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి జోక్యంతో తమ దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ.. ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టులు ఇవే!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.9,076.11 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 10,531 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రైతు కుటుంబాలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ఇథనాల్‌కు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో, ఆ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి ఒక ప్రత్యేక పాలసీని రూపొందించాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 పర్యాటక ప్రాంతాల్లో 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం, గండికోట, లంబసింగి వంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సోలార్ సెల్స్ తయారీలో ఏపీని అగ్రగామిగా నిలపాలని, పెండింగ్‌లో ఉన్న 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐపిబి ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టుల వివరాలు:

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ: నెల్లూరులో రూ.139.92 కోట్లతో 4-స్టార్ హోటల్ (180 మందికి ఉపాధి).
2. మాధవి లీజర్ అండ్ స్టేస్: కడపలో రూ.52.10 కోట్లతో 3-స్టార్ హోటల్ (400 మందికి ఉపాధి).
3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్: కడపలో రూ.68.69 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ (690 మందికి ఉపాధి).
4. వజ్ర హాస్పిటాలిటీ: విజయవాడలో రూ.62.40 కోట్లతో హోటల్, బ్యాంక్వెట్ సెంటర్ (450 మందికి ఉపాధి).
5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్: తిరుపతి జిల్లాలో రూ.255 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (400 మందికి ఉపాధి).
6. అక్షత్ గ్రీన్‌టెక్: అనకాపల్లి జిల్లాలో రూ.1,600 కోట్లతో సోలార్ సెల్, మాడ్యూల్ యూనిట్ (750 మందికి ఉపాధి).
7. బెర్రీ అలాయ్స్: బొబ్బిలిలో రూ.1,200 కోట్లతో మాంగనీస్ సింటర్ ప్లాంట్ (831 మందికి ఉపాధి).
8. జియో మైసూర్ ఇండియా: కర్నూలు జిల్లా తుగ్గలిలో రూ.689 కోట్లతో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ (1,750 మందికి ఉపాధి).
9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ (గూగుల్ వేర్‌హౌస్ పార్ట్‌నర్స్): విశాఖలో రూ.1,008 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (5,000 మందికి ఉపాధి).
10. అదానీ ఫౌండేషన్: విశాఖ జిల్లా కపులుప్పాడలో రూ.2,200 కోట్ల ప్రాజెక్టు.
11. మోండెలీజ్ ఇండియా ఫుడ్స్: శ్రీ సిటీలో రూ.1,801 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (80 మందికి ఉపాధి).

గత రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా, మొత్తం 339 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.11.86 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.41 లక్షల ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయాలతో పారిశ్రామికంగా రాష్ట్రం మరింత బలోపేతం కానుంది.

## భక్తిశ్రద్ధలతో బంజారాల సీత్లా భవాని పండుగ



లోకల్ గైడ్. ఖమ్మం తెలంగాణలోని బంజారా (లంబాడీ) గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ప్రకృతి ఆరాధనా పండుగ సీత్లా భవాని పండుగ వేడుకలు ఆషాఢ మాసంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. లిసమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద వ్యాధుల బారిన పడకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ తండాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. లంబాడీల కులదైవమైన సీత్లా భవానితో పాటు మేరమా, తుల్జా, అంబా భవాని తదితర ఏడుగురు దేవతలను ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకతగా నిలుస్తుంది.పండుగ సందర్భంగా తండా ప్రజలందరూ గ్రామ పొలిమేరల్లోని దేవతల ప్రతిరూపాల వద్దకు చేరుకుని సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. నైవేద్యాలు సమర్పించి, స్థానిక ఆచారాల ప్రకారం బలిపూజలు నిర్వహిస్తూ అమ్మవారి ఆశీస్సులు కోరుతారు. తొలకరి వర్షాలు కురిసిన అనంతరం కొత్త వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందు విత్తనాలను పూజించి, పంటలు బాగా పండాలని ప్రార్థిస్తారు.ఈ వేడుకల్లో ముఖ్యమైన 'దాటుడు' ఆచారాన్ని కూడా నిర్వహిస్తారు. పశువులు, ప్రజలు చెడు దృష్టి, అంటువ్యాధులు, అపశకునాల నుంచి రక్షణ పొందాలని విశ్వసిస్తూ అమ్మవారి ప్రసాదాన్ని దాటి వెళ్లడం ఆనవాయితీగా కొనసాగుతోంది. రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, యువతులు పాల్గొని జానపద నృత్యాలు, భక్తి గీతాలతో పండుగకు ప్రత్యేక శోభ తీసుకొస్తారు. ప్రకృతి, వ్యవసాయం, పశుసంపదతో ముడిపడిన ఈ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది.

### ఈ నెల 10న జాబ్ మేళా నిర్వహణ ....

## జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

ఖమ్మం, జూలై -07:లోకల్ గైడ్ :ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం మెగా సిటీ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖమ్మంలో ఉద్యోగాలు కల్పించుటకు జూలై 10న (శుక్రవారం) ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ కు ఎదురుగా ఉన్న టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (5) ఉద్యోగాలకు డిగ్రీ లేదా ఎంబిఏ అర్హత గలవారు, ప్లంబింగ్ టెక్నీషియన్స్ (20) ఉద్యోగాలకు ఏదేని ఐటిఐ లేదా ఇంటర్మీడియట్ అర్హత గలవారు, 18 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులని ఎంపికైన వారికి వేతనం 14 వేల నుండి 16 వేల వరకు ఉంటుందని తెలిపారు.మొత్తం 25 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, ఇట్టి ఉద్యోగ ఖాళీలు ఖమ్మంలో ఉన్నాయని, ఆసక్తి అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు హెచ్ ఆర్ సెల్ నెంబర్ 9281408255, 9550615853 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి మాధవి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుంటే ఖమ్మంలో సీఎం మీటింగ్ ను.




లోకల్ గైడ్ :. ఖమ్మం) అడ్డుకుంటాం.పి.డి.ఎస్.యు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జీ. మస్తాన్. రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఖమ్మం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఈరోజు కాకతీయ యూనివర్సిటీ అనుబంధం పీజీ



కళాశాల మరియు బీపిడి కళాశాల ఎదుట నిరసన తెలిపి అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది... ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జి.మస్తాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు విద్యారంగానికి అనేక రకాల హామీలు ఇచ్చి అధికారాలు వచ్చిన తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. ముఖ్యంగా మేము అధికారంలోకి వస్తే ఇంకా మెరుగైన రీతిలో ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తాం, విద్యా రంగానికి బడ్జెట్లో 15% నిధులు కేటాయిస్తాం, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తాం, టిఆర్ఎస్ ప్రభుత్వం మూసివేసిన దాదాపు 6000 పాఠశాలలను తిరిగి మెరుగైన సదుపాయాలతో పున ప్రారంభం చేస్తాం, ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు చేసి ప్రైవేటు ఫీజులు నిర్ణయిస్తాం ఇలా అనేక హామీల వర్షం కురిపించి అధికారాన్ని చేపట్టిన రేవంత్ సర్కార్ నేడు విద్యాశాఖ మంత్రి నియమించకుండా విద్యారంగ సమస్యల పరిష్కరించకుండా పేరుతో విగ్రహాల పేరుతో ప్రజాధనాన్ని దుబారాగా ఖర్చు చేస్తున్నాడు. నేడు కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో లక్షల రూపాయలు తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్న విద్యాధికారులు పట్టించుకోవడం లేదు, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఒక బ్రాంచ్ పర్మిషన్ తో 2, 3 బ్రాంచులు నిర్వహిస్తున్న వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు, విద్యా సంవత్సరం ప్రారంభం రాకముందే ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై బుక్స్ తో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. ఖాళీగా ఉన్న డీఈవో ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, ఖమ్మం జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ నిర్మించాలని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ప్లీజ్ రియంబర్స్మెంట్ పథకంపై ఆధారపడి చదువుతుంటే వారికి రావలసిన బకాయిలు దాదాపు 11 వేల కోట్ల రూపాయలు విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయాలను తక్షణమే చెల్లించాలి లేని పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బకాయిలు విడుదల చేయకుండా మీరు ఖమ్మం మీటింగ్ కు వస్తే అడ్డుకొని తీరుతామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షులు గాంధీ, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ ,నరసింహ, శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక సేవకు రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా గంజికుంట్ల వెంకన్నకు సత్కారం



లోకల్ గైడ్. ఖమ్మంసీసీ కెమెరాలు, ఉచిత ఇంటర్నెట్ సేవలకు గుర్తింపు.ఖమ్మం కమిషనరేట్లో మెమెంటో ప్రదానంతెలంగాణం, నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ప్రజావేదిక ఎడిటర్ గంజిగుంట్ల వెంకన్నను మంగళవారం ఖమ్మం పోలీస్ కమిషనరేట్లో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ మెమెంటోతో సత్కరించారు. గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించారు.చెన్నారం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు భారీ విరాళం అందించడంతో పాటు, చెన్నారం గ్రామపంచాయతీతో పాటు కొత్తూరు, మండ్రాజూపల్లి తదితర గ్రామపంచాయతీలకు ఉచితంగా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించిన సేవలను గుర్తిస్తూ ఈ సత్కారం చేసినట్లు గంజిగుంట్ల వెంకన్న తెలిపారు.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీసు శాఖ పిలుపునకు స్పందించి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో ముందుండి సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు

## ఫుడ్ సేఫ్టీ శాఖ కట్టుబడి ఉంది.... ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్



ఖమ్మం, జూలై -07:లోకల్ గైడ్ :వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఇన్‌చార్జి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ తెలిపారు.ఖమ్మం నగరంలోని పిస్తా హౌస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం తన కుమార్తె అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఒక వినియోగదారుడు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం సంబంధిత రెస్టారెంట్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, వంటశాల నిర్వహణ, ఆహార భద్రత ప్రమాణాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలలో భాగంగా రెండు ఆహార పదార్థాల చట్టబద్ధ (సూచ్) నమూనాలను సేకరించి, విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ మాట్లాడుతూ, ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం వాటిలో తేలిన ఫలితాల ఆధారంగా ఆహార భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర ఆహార వ్యాపార సంస్థలపై ఫుడ్ సేఫ్టీ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆహార వ్యాపార నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి విక్రయించడంతో పాటు, నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలని, ఆహార భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.వినియోగదారులు ఆహారం తీసుకునే సమయంలో పరిశుభ్రత, నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నాసిరకం, కలుషితమైన లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఎటువంటి రాజీ లేకుండా ఫుడ్ సేఫ్టీ శాఖ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటును కాపాడాలి

### తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై07(లోకల్ గైడ్ న్యూస్):తెలంగాణ రాష్ట్రంలో గత మూడు నెలల నుండి ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ జరుగుతున్న సందర్భంలో రాజకీయ పార్టీల కార్యకర్తలు, పౌర సమాజం, యువజన సంఘాలు, విశ్రాంత ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు, సామాజిక చైతన్య సంస్థలు, వేదికలు, వాకర్ సంఘాలు, అత్యంత జాగ్రత్తతో 18 సంవత్సరాల పైబడిన యువతీ యువకుల నుండి అత్యంత వృద్ధులైన వారి ఓట్లను కాపాడవలసిన బాధ్యతను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్బులో ఎస్ ఐ ఆర్ సమస్యలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ధనవంతులు ఓటు హక్కును ఉపయోగిస్తారని కేవలం పేద వర్గాలు మాత్రమే ప్రభుత్వాల తలరాతలు నిర్ణయిస్తారని అలాంటి ఓట్లు జాబితా నుండి గల్లంతు కాకూడదని అన్నారు. సంక్లిష్టమైన ఓటర్ నమోదు ఫారం నింపే అవగాహన లేని ఓటర్లు అత్యధికంగా ఉన్న విషయాన్ని ఎలక్షన్ కమిషన్ అధికారులు, నియోజకవర్గ స్థాయి ఎన్నికల అధికారులు గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ జనాభాలో 15 శాతం ఉన్న వృద్ధుల ఓట్లు, ఆర్థికంగా సామాజికంగా పేద వర్గాల ఓట్లు ప్రజాస్వామ్యం మనగడకు కీలక పాత్ర పోషిస్తాయని విషయాన్ని ఎలక్షన్ అధికారులు, సిబ్బంది పౌర సమాజం నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. పేద వర్గాల అభివృద్ధి సంక్షేమం కొరకే రాజ్యాంగంలో ప్రజాస్వామ్యం వ్యవస్థల నిర్మాణం జరిగిందని అందులో ఓటర్ల జాబితా సవరణ అత్యంత ప్రాధాన్యత కలిగిందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేర్కొన్నారని, అందుకే పేదలు, దనికులు అక్షరాస్యులు నిరక్షరాస్యులు అనే విచక్షణ లేకుండా 18 సంవత్సరాలు పైబడిన ప్రతి పౌరునికి అంబేద్కర్ ఓటు హక్కు కల్పించారని అన్నారు. దేశంలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నడుస్తున్న క్రమంలో అనేక అవకతవకలు వాస్తవ ఓటర్లను ఓటర్ల జాబితాలో కనిపించకుండా పోయిన కథనాలు ఎన్నో బీహార్ పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో చోటు చేసుకున్నాయని కథనాలు అనేకం వెలువడ్డాయని అన్నారు. ఓటర్ నమోదు కార్యక్రమాలలో జరిగిన అక్రమాలతో కొన్ని రాష్ట్రాలలో పార్టీల తలరాతలు కూడా మారాయని పత్రికలు, ఇతర మీడియా సంస్థలు ప్రజాస్వామ్యవాదులు గగ్గోలు పెడుతున్న విషయాలను విస్మరించరానివని అన్నారు. గ్రామాల నుండి పట్టణాలకు పట్టణాల నుండి నగరాలకు లక్షలాదిమంది ఓటర్లు పౌరులు ఉద్యోగ ఉపాధి రీత్యా వలసలు వెళుతున్న పరిస్థితులలో ప్రత్యేక ఓటరు నమోదులో తప్పిపోయే ప్రమాదం కూడా పొంచి ఉందని ఓటర్ ఫామ్స్ నింపడానికి సరైన అవగాహన లేని ఓటర్లు అత్యధికంగా ఉన్న మన సమాజంలో ఎన్నికల సమయానికి పేదల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షులు పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ ఓటరు చైతన్యం లేకపోవడం వల్ల జరిగే అనర్థాలు అవకతవకలు చోటు చేసుకుంటాయని పౌర సమాజం జాగ్రత్తగా సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థలను రాజ్యాంగ హక్కులను కాపాడడానికి అన్ని పౌర సంఘాలు చైతన్యంతో నిబద్ధతతో కృషిచేయాలని అన్నారు. బోగస్ ఓట్ల తొలగింపు ఒకే వ్యక్తికి రెండు లేదా మూడు ప్రదేశాలలో ఉన్న ఓట్ల తొలగింపు లాంటివి చేసినప్పటికీ వాస్తవిక ఓటర్లకు అన్యాయం జరగకూడదని ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడకూడదని అందులో పౌర సమాజమే ప్రముఖ పాత్ర పోషించాల్సిన బాధ్యత ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బొమ్మినేని పాపిరెడ్డి, బి.సి ముస్లిం అసోసియేషన్ నాయకులు డాక్టర్ రాజ్ మహ్మద్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వీరమల్ల బాబురావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, శాంతి సంఘం నాయకులు దొమ్మాట ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సర్ సర్ పట్ల జాగ్రత్తగా ఉండాలి ప్రజలకు ,పార్టీ శ్రేణులకు అర్థమయ్యేలా చెప్పాలి

### పార్టీ శ్రేణులు స్వయంగా తిరుగుతూ పరిశీలించాలి ఆర్ జె సి కృష్ణా



వైరా:లోకల్ గైడ్ :సర్ కార్యక్రమంపై అప్రమత్తంగా ఉండాలి ప్రజలకు అవగాహన వచ్చేలా ప్రతి ఒక్కరూ బిఆర్ఎస్ పార్టీ తరపున సమన్వయంతో పనిచేయాలని ఆర్ జె సి కృష్ణ అన్నారు .మంగళవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5, 12 వార్డులలో సర్ కార్యక్రమాన్ని ఆర్ జె సి కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ జె సి కృష్ణ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు వైరా మున్సిపాలిటీ మరియు మండలంలో ప్రతి వార్డు ప్రతి గ్రామంలో స్వయంగా తిరుగుతూ సర్ కార్యక్రమం ఎలా నిర్వ హిస్తున్నారో ఎప్ప టికప్పుడు తెలు సకోవాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీశ్రేణులు అప్రమత్తంగా ఉంటూ అర్హు ల పేర్లు ఓటర్ల జాబితాలో నుండి గల్లంతు కాకుండా చూడాలి అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి అండగా ఉండే యువతీ యువకులతో కొత్తగా ఓటరు నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్ట కృష్ణ అర్జునరావు వనమా విశ్వేశ్వరరావు బానోత్ మనీషా లక్ష్మి, కౌన్సిలర్లు చిలకా కోటయ్య మాదినేని సునీత, బిఆర్ఎస్ మండల పట్టణ మాజీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు ,మద్దెల రవి, పెరుమాల కృష్ణమూర్తి,మాదినేని దుర్గాప్రసాద్ ,అప్పం సురేష్, మిట్టపల్లి కిరణ్ ,నూకల ప్రసాద్, తిరుపతి శ్రీను, ఏదునూరి శ్రీను, మేదరమెట్ల శ్రీనివాసరావు ,నూకల వాసు ,తన్నీరు కిషోర్ , ఆదూరి ప్రేమ్ ,వజినే పల్లి చక్రవర్తి, కొల్లా రాంబాబు, కట్టా నాగేశ్వరరావు ,ఏలూరు నరసింహారావు, వేముల శివ, జడల కళ్యాణ్ ,రావూరి సురేష్, సింగవరపు నరేష్, కొమ్ము సైదులు తదితరులు పాల్గొన్నారు

### మిడ్జిల్ మండల

## నూతన ఎంపీడీవోగా లక్ష్మణ్ రాథోడ్ బాధ్యతల స్వీకరణ



మిడ్జిల్ జులై 7(లోకల్ గైడ్ ):మిడ్జిల్ మండల నూతన మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా లక్ష్మణ్ రాథోడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలంలో ఎంపీవోగా విధులు నిర్వహించిన ఆయన, పదోన్నతి పొందుతూ మిడ్జిల్ మండలానికి నియమితులయ్యారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మణ్ రాథోడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.

## బడుగు బలహీన వర్గాలు ఆశాజ్యోతి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు.......

### 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.....

### ఆదరణ ఫౌండేషన్ అనాధాశ్రమాలు అన్నదానం నిర్వహించిన

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ



మధిర :లోకల్ గైడ్ :మధిర మండలం కేంద్రంలోని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్నగారిని వర్గాలు ఆత్మడు మహాజన సూర్యుడు వృద్ధులు వితలాంతలు ఆత్మీయుడు ఆరోగ్య శ్రీ ప్రాణదాత పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ గారి జన్మదిన వేడుకలు మధిర పట్టణంలోని సుశీల డిగ్రీ కాలేజ్ నందుగల అనాధాశ్రమం ఆదరణ సేవా ఫౌండేషన్ ఆశ్రమంలో వితలాంతులు వృద్ధులు మధ్య కేక్ కటింగ్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, ఎమ్మార్పీఎస్ స్థానిక ఆఫీస్ నందు జెండా ఆవిష్కరణ చేసిన ఎమ్మార్పీస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కురపాటి సునీల్ మాదిగ గారు,




ఎమ్మెస్పి నగరం మండల నాయకులు ఎస్.కె రంజాన్ గారు మందకృష్ణ మాదిగ గారి జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల చిరకాల కాంక్ష వర్గీకరణ సాధించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది, వర్గీకరణ సాధనలో మాదిగల అమరులు త్యాగాలను వర్ణించలేనివి నిజమైన త్యాగస్ఫూర్తిని, తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊటుకూరి రత్నాకర్ మాదిగ గారు, ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ పార్శపు ఏనూక మాదిగ గారు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రాయవరపు దేవదాస్ మాదిగ గారు, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు మేష పోగు ఇర్మియ మాదిగ గారు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, పల్లె పోగు స్వామి మాదిగ గారు, ఎమ్మార్పీఎస్ మధిర మండల నాయకులు, వేల్పుల పవన్ కళ్యాణ్ మాదిగ గారు, కొండూరు రాజేష్ మాదిగ గారు, ఎర్రుపాలెం ఎమ్మెస్ మండల అధ్యక్షుడు, గటి గుండె కిషోర్ మాదిగ గారు, ఎమ్మార్పీఎస్ ఎరుపాలెం మండల అధ్యక్షుడు చింతిరాల సురేష్ మాదిగ గారు, రాష్ట్ర విద్యార్థి సంఘ నాయకులు సగుర్తి శ్యామ్ మాదిగ గారు, విద్యార్థులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తొగుట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పంది రాజు ముదిరాజ్‌కు నియామక పత్రం అందజేత



లోకల్ గైడ్ తొగుట జూలై 7: దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే క్రమంలో తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన పంది రాజు ముదిరాజ్‌కు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అధికారిక నియామక పత్రాన్ని హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు.ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. మండల అధ్యక్షుడిగా పంది రాజు ముదిరాజ్ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.పంది రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, చెరుకు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయడంతో పాటు కార్యకర్తలకు అండగా నిలిచి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ (అమర్) రెడ్డి, సర్పంచ్ రాంపురం రమేష్‌తో పాటు చిలువేరి రాంరెడ్డి, చందా సత్తయ్య, పాత్కుల వెంకటేశం, ఉల్లెంగుల సాయి, పంది నర్సింలు, కనకయ్య, కృష్ణగౌడ్, మెట్టు స్వామి, కన్నేశ్, స్వామి, చందు తదితర నాయకులు పాల్గొన్నారు.

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై07(లోకల్ గైడ్ న్యూస్):పోలీసులు తమ విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం సొంతం చేసుకోవడం ఎంతో కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను మంగళవారం పోలీస్ కమిషనర్ మామూనూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో ప్రారంభించారు.భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్,ఖమ్మం పోలీస్ కమీషనరేట్,మహబూబాబాద్ మరియు భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది డ్యూటీ మీట్ లో భాగంగా కంప్యూటర్ పరిజ్ఞానం,ఫోరెన్సిక్ సైన్స్,ఫింగర్ ప్రింట్ లిఫ్టింగ్, ప్యాకింగ్, హ్యాండ్లింగ్,బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్,ఫోటోగ్రఫీ వీడియో గ్రఫీ వంటి విభాగాల్లో సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు.ప్రతి విభాగంలో ప్రతిభ కనబర్చిన వారిని, త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ కోసం ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ పోటీలు కూడా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలోనే నిర్వహించబడతాయి.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్‌లు అధికారులకు తమ నైపుణ్యాలను మెరుగుపర్చే అవకాశం కల్పిస్తాయి. నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీ లు బాలస్వామి, శ్రీనివాస్ తో పాటు జోనల్‌కు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాల అంటువ్యాధుల నివారణపై డీఎంహెచ్ఓ డా. ధనరాజ్ ఆకస్మిక తనిఖీలు

**దోమల నియంత్రణ, సికిల్ సెల్, అనీమియా, క్షయ వ్యాధి నివారణపై ప్రత్యేక దృష్టి**



లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 7: వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధులను నివారించేందుకు జిల్లాలో చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. ధనరాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట బస్తీ దవాఖాన (బీడీకే), ఆర్‌డబీ ప్రాంతం, ముస్తాబాద్ చౌరస్తా, పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాల అమలును పరిశీలించారు.బీడీకే ప్రాంతంలో ఫాగింగ్, స్ప్రేయింగ్ పనులను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ, ముస్తాబాద్ చౌరస్తాలో దోమల లార్వా పెరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి నిల్వ నీటిని తొలగించి వెక్టర్ కంట్రోల్ చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు



ఆదేశించారు.అనంతరం ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. వినోద్ బాబ్జీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శ్రీకాంత్ యాదవ్‌లతో కలిసి పీఎంహెచ్ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. సికిల్ సెల్ అనీమియాపై సమీక్ష నిర్వహించి విద్యార్థుల్లో అవగాహన పెంచడంతో పాటు వ్యాధి నిర్ధారణ కార్యక్రమాలను బలోపేతం చేయాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే బృందం విద్యార్థులకు హీమోగ్లోబిన్ (ఎచ్) పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారిని గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించే చర్యలు చేపట్టింది.తదుపరి పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ, ఆరోగ్య కార్యక్రమాల అమలు, ల్యాబ్ పరీక్షలు, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆశా డే సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాల అంటువ్యాధుల నిర్మూలన, క్షయ వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి క్రమం తప్పకుండా ఫాలోఅప్ నిర్వహించాలని సూచించారు.మందుల నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించి దోమల నివారణపై ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో డా. షేక్ నిలౌఫర్, శ్రీ చక్రధర్ (ఎస్‌యూఓ), ఫైలేరియా బృందం, నసర్‌పురా యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పుల్లూరు వైద్యాధికారి డా. రాజేందర్, సీహెచ్ఓ లక్ష్మి, పీహెచ్ఎన్ శాంతతో పాటు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## దుబ్బాకకు యంగ్ ఇండియా స్కూల్ మంజూరు

**సీఎం రేవంత్ రెడ్డికి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు**



లోకల్ గైడ్ దుబ్బాక, జూలై 7: దుబ్బాక నియోజకవర్గానికి యంగ్ ఇండియా స్కూల్ మంజూరు కావడం పట్ల దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా దుబ్బాక నియోజకవర్గానికి యంగ్ ఇండియా స్కూల్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించి ఇచ్చిన హామీ మేరకు స్కూల్‌ను మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.దుబ్బాక నియోజకవర్గ విద్యాభివృద్ధికి యంగ్ ఇండియా స్కూల్ కీలకంగా నిలుస్తుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమని చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని ఆయన అన్నారు.

## ఉస్మానియా వైద్య బృందానికి టీజీఓ డాక్టర్స్ ఫోరం ఘన సన్మానం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, లోకల్ గైడ్, జూలై 7:-ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో 36 గంటలపాటు నిర్విరామంగా శ్రమించి ఐదు అవయవాల (మల్టీ-ఆర్గన్) మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీఓ) అసోసియేషన్ డాక్టర్స్ ఫోరం మంగళవారం ఘనంగా సన్మానించింది. ఈ విజయాన్ని తెలంగాణ ప్రభుత్వ వైద్య రంగంలో చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించింది.ఈ సందర్భంగా సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం డా. మధుసూదన్, డా. సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని బృందంతో పాటు అనస్థీషియా విభాగానికి చెందిన డా. పందు నాయక్, డా. మాధవి ఆధ్వర్యంలోని వైద్యులు, నర్సింగ్, సాంకేతిక, సహాయక సిబ్బందిని వారి సేవలకు గుర్తింపుగా సత్కరించారు.టీజీఓ డాక్టర్స్ ఫోరం అధ్యక్షుడు డా. కత్తి జనార్ధన్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యుల నైపుణ్యం, అంకితభావం, సమన్వయంతోనే ఇంత క్లిష్టమైన బహుళ అవయవ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక వైద్య సేవలు అందించగల సామర్థ్యాన్ని ఈ విజయం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు. ఈ విజయం ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వైద్యులకు, వైద్య విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.అనంతరం ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాకేష్ సహాయ్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. రాజారావులను పరిపాలనా సహకారానికి గుర్తింపుగా సన్మానించారు.కార్యక్రమంలో డా. సరిత కళ్యాణం, డా. జానకి, డా. మణీషా సహాయ్, డా. కిరణ్మయి, డా. వెంకట్, డా. అభిరామ్, శ్రీ శ్రవణ్ కుమార్, డా. రమేష్, డా. మల్లికార్జున్, డా. మాధవి, డా. విజయ్ భాస్కర్, డా. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

స్వీకరించిన ఫామ్ లను డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా

ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు చేయాలి

మధిర, ఎర్రుపాలెం మండలాలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



ఖమ్మం/మధిర, జూలై – 07:లోకల్ గైడ్ :ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధిర పట్టణంతో పాటు ఎర్రుపాలెం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు



(బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న విధానం, నింపిన ఫారాలను స్వీకరిస్తున్న తీరు, ఓటర్ల వివరాలను నమోదు చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు కాలనీలు, నివాస ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్ ఓటర్లతో నేరుగా మాట్లాడారు. ఎన్యూమరేషన్ ఫారాలపై వారికి ఉన్న సందేహాలు, అపోహలను తెలుసుకుని వాటిని నివృత్తి చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఉద్దేశ్యం, ఫారాల ప్రాముఖ్యత, సకాలంలో వివరాలు అందజేయాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ప్రతి బీఎల్ఓ తప్పనిసరిగా బీఎల్ఓ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే వివరాలను నమోదు చేయాలని, సమాచార నమోదులో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితానే మూలాధారం అని, అందులో ప్రతి ఓటరు వివరాలు తప్పుల్లేకుండా నమోదు కావడం అత్యంత కీలకమని ఆయన అన్నారు. ప్రతి నమోదు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, డేటా నమోదు, ధృవీకరణ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బీఎల్ఓ రోజువారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని తమ పరిధిలోని ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందించి, పూర్తి చేసిన ఫారాలను నిర్దేశిత గడువులోగా తిరిగి స్వీకరించి డిజిటైజేషన్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరూ మిగిలిపోకుండా ప్రతి కుటుంబాన్ని చేరుకోవాలని, సర్వే ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని సూచించారు.ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ సమయంలోనే ఓటర్లకు ఎదురయ్యే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని, తప్పుడు ప్రచారం లేదా అపోహలకు ఆస్కారం లేకుండా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్లలో విశ్వాసం పెంపొందించడం, ఎన్నికల ప్రక్రియపై స్పష్టత కల్పించడం బీఎల్‌ఓల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఓటరు తన వ్యక్తిగత వివరాలను సక్రమంగా నమోదు చేసి, పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్‌ఓలకు అందజేసి ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.పారదర్శకమైన, విశ్వసనీయమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకుగా భాగస్వాములు కావాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సహకరించాలని ఆయన కోరారు. అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే నాణ్యమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, మధిర మండల తహసీల్దార్ రాంబాబు, ఎర్రుపాలెం మండల తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, మధిర మున్సిపల్ కమిషనర్, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు), సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆమనగల్లులో ఘనంగా ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మాదిగల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి: కావలి శ్రీశైలం మాది**



లోకల్ గైడ్ । ఆమనగల్లు, జూలై 7ఎంఆర్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) 32వ ఆవిర్భావ దినోత్సవం, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ ఆమనగల్లు మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం మాదిగ మాట్లాడుతూ, మాదిగల హక్కుల సాధనతో పాటు అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంఆర్పీఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.ఏబీసీడీ వర్గీకరణ సాధించడం చారిత్రాత్మక విజయమని, అయితే దాని ఫలాలను పూర్తిస్థాయిలో పొందాలంటే మాదిగ యువత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు పల్లేటి జగన్, ఎంఆర్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీరామ్ మాదిగ, సోషల్ మీడియా కన్వీనర్ జంతుక విజయకుమార్ మాదిగ, అధికార ప్రతినిధి మంద రాకేష్ మాదిగ, ముస్తజ్‌పల్లి గ్రామ అధ్యక్షుడు ఒగ్గు రాజు మాదిగ, జంతుక జానయ్య, మాజీ వార్డు సభ్యుడు సాయిలు, మాజీ కౌన్సిలర్లు సుండూర్ శేఖర్, లక్ష్మణ్, దుడ్డు కృష్ణ యాదవ్, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకుడు మల్లెపోగు మల్లేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్యతో పాటు రాములు, విక్టర్, సురేష్, శివ, జీవన్, రమేష్, భాస్కర్, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిరస్త్రాణమే ప్రాణ రక్షణ కవచం... తప్పనిసరిగా ధరించండి!”

**హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి**

**వాహనదారులకు అవగాహన కల్పించిన ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు**




లోకల్ గైడ్:ఆమనగల్లు, జూలై 7 రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు సూచించారు.మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించిన ఆయన, హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను గుర్తించి చలాన్లు విధించారు. అనంతరం వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు, వాటి తీవ్రతను వివరించారు.రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం ఎక్కువగా తలకు తీవ్ర గాయాలు కావడం వల్లే జరుగుతుందని, నాణ్యమైన హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.“మన భద్రత మన చేతుల్లోనే ఉంది. మనం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరులకు కూడా వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలం. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలకు అండగా ఉండేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి” అని ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.ఆమనగల్లు పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని

## పేదల కంటి వెలుగుకు భరోసాగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.



లోకల్ గైడ్ । ఆమనగల్లు, జూలై 7:రంగారెడ్డి జిల్లాతలకొండపల్లి మండల కేంద్రంల లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నాల్గవ రోజుకు విజయవంతంగా చేరుకుంది. శ్రీ దేవకి ఫంక్షన్ హాల్‌లో కొనసాగుతున్న ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం నుంచి ఉచిత కంటి శుక్లాల (క్యాటరాక్ట్) శస్త్రచికిత్సలు ప్రారంభించగా, మొదటి రోజే 29 మంది రోగులకు విజయవంతంగా సర్జరీలు నిర్వహించారు.నాలుగు రోజుల వ్యవధిలో 3,200 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 1,820 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 1,178 మందికి ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేయగా, 112 మంది శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు. నాల్గవ రోజు ఒక్కరోజే దాదాపు వెయ్యి మంది శిబిరాన్ని సందర్శించగా, 630 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 382 మందికి కంటి అద్దాలు అందజేశారు. మరో 30 మంది శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వైద్య బృందంతో సమావేశమై శిబిరం నిర్వహణ, శస్త్రచికిత్సల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ కంటి వైద్యానికి దూరం కాకూడదనే లక్ష్యంతో ఐక్యత ఆరోగ్య భరోసా కార్యక్రమం ద్వారా ప్రముఖ శంకర నేత్రాలయ, చెన్నై వైద్య నిపుణుల సేవలను కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన తమ బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు.ఈ నెల 10వ తేదీ వరకు ఉచిత కంటి పరీక్షలు, 12వ తేదీ వరకు ఉచిత కంటి శుక్లాల శస్త్రచికిత్సలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిబిరాన్ని సందర్శించిన పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. గ్రామీణ నిరుపేదలకు ప్రముఖ వైద్యుల సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమని, ఇలాంటి ఆరోగ్య శిబిరాలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వీరేష్, మల్లేష్, దాస్ నాయక్, కళ్యాణ్ నాయక్, ఉపసర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు బాల్‌రాజ్, నరేందర్ గౌడ్, శ్రీరాములు, మాజీ ఉపసర్పంచ్ హట్య నాయక్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రఘు, యాదయ్య, విజయ్ కుమార్, శ్రీపతి, శేఖర్, బాస్కర్, సాయి కిరణ్, శంకర నేత్రాలయ వైద్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పద్ధతిలో పత్తి సాగు పరిశీలించిన కలెక్టర్,...



అదిలాబాద్ జిల్లా జూలై 7 లోకల్ గైడ్‌మంగళవారం భీంపూర్ మండలం బెల్సారి రాంపూర్ శివారులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాల మేరకు జంట సళ్ళ పద్ధతిలో పత్తి సాగు చేస్తున్న రైతు గోవర్ధన్ తన పొలన్నీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరిశీలించారు. జంట సళ్ళ పద్ధతినీ రైతు వివరిస్తూ, వర్షాలు పడినా ఇబ్బంది ఉండదని, వ్యవసాయ పనులకు వీలుగా ఉంటుందని, అడవి పందుల నుండి పంటను రక్షించుకునే విలుతో పాటు అధిక దిగుబడి వస్తుందని కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జెండాగూడ డ్యామ్‌ను కలెక్టర్ సందర్శించగా, గ్రామ రైతుల కోసం హై పాయింట్‌లో కెనాల్ ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, త్వరలోనే సంబంధిత అధికారులను పంపి, పరిశీలన చేయించి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.అంతకుముందు భీంపూర్ మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డిని ఎరువుల యాప్ వినియోగం, మ్యాపింగ్, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ రమేష్, రైతులు, గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.. విద్యుత్ సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష




లోకల్ గైడ్ । ఆమనగల్లు, జూలై 7కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను వివిధ నాయకుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాడ్గుల మండలానికి చెందిన 3 మంది, తలకొండపల్లి మండలానికి చెందిన 4 మంది, వెల్దండ మండలానికి చెందిన 4 మంది లబ్ధిదారులకు మొత్తం 11 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన విద్యుత్ శాఖ అధికారులతో పాటు మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు సంబంధించిన అభివృద్ధి పనులు, విద్యుత్ సరఫరా, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరగా పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు.

## గ్రేటర్ వరంగల్
## పారిశుద్ధ్య నిర్వహణకు అంతర్జాతీయ ప్రశంసలు

**నగర మలశుద్ధీకరణ విధానాలను పరిశీలించిన ఎడిబిఏ జపాన్ కన్సల్టెంట్‌జిల్లా కలెక్టర్, జిడబ్లుఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయ్, బల్దియా కమిషనర్ వెంకన్నతో సమావేశం**



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై07(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ,గ్రేటర్ వరంగల్ నగరంలో అమలు చేస్తున్న మలశుద్ధీకరణ, మలవిసర్జన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ విధానాలను ఆసియా అభివృద్ధి బ్యాంకు సంస్థ (ఏడీబీఐ) జపాన్ కన్సల్టెంట్ డాక్టర్ కజుషి హషిమోటో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రశంసించారు. ముందుగా ప్రతినిధుల బృందం అమ్మవారిపేటలో ఏర్పాటు చేసిన రోజుకు 15 కిలోలీటర్లు, 150 కిలోలీటర్ల సామర్థ్యం గల మలశుద్ధీకరణ కేంద్రాలను సందర్శించి, అక్కడ అమలవుతున్న శుద్ధీకరణ ప్రక్రియ, నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లో మలవిసర్జన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థపై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జిడబ్లుఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయ్, బల్దియా కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, నగరంలో మలవిసర్జన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సుస్థిర పారిశుద్ధ్య విధానాలను ప్రోత్సహించే క్రమంలో జీడబ్ల్యుఎంసీ, ఆస్కీ సంస్థల సహకారంతో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా అమ్మవారిపేటలో రోజుకు 15 కిలోలీటర్ల సామర్థ్యంతో మలశుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పైరోలసిస్ విధానం ద్వారా మలాన్ని సేంద్రీయ ఎరువుగా మార్చి వ్యవసాయ భూముల్లో వినియోగిస్తున్నామని తెలిపారు. శుద్ధి చేసిన నీటిని రహదారి మధ్య విభజన ప్రాంతాల్లోని మొక్కలకు వినియోగిస్తున్నామని వివరించారు. నగర అవసరాలకు అనుగుణంగా ఇటీవల రోజుకు 150 కిలోలీటర్ల సామర్థ్యం గల ఆధునిక మలశుద్ధీకరణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లో అమలవుతున్న పారిశుద్ధ్య నిర్వహణ విధానాలు, మలశుద్ధీకరణ సాంకేతికత, వనరుల పునర్వినియోగ విధానం ఆదర్శప్రాయంగా ఉన్నాయని డాక్టర్ కజుషి హషిమోటో ప్రశంసించారు. ఈ తరహా సుస్థిర పారిశుద్ధ్య నమూనాలు ఇతర పట్టణాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీఎం హెచ్ ఓ డా. రాజారెడ్డి, ఈఈలు మహేందర్, స్పందన, ఆస్కీ ప్రతినిధులు డా. స్నేహలత, రాజ్‌మోహన్ రెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి.... స్థానిక నేతల సహకారం తీసుకోవాలి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి



గండిపేట, జూలై 7 (లోకల్ గైడ్): నార్సింగ్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఎస్ఆర్ ప్రక్రియను అధికారులు స్థానిక నేతల సహకారంతో పారదర్శకంగా నిర్వహించాలని బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....అన్ని పార్టీల స్థానిక అధ్యక్షులు, నాయకులతో మాట్లాడి సమాచారం సేకరిస్తూ ఎస్ఆర్ ప్రక్రియ చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఎస్ఆర్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ: అధికారులు ప్రజల ఇంటి వద్దకు నేరుగా వెళ్లి ఎస్ఆర్ సంబంధిత పూర్తి వివరాలు సేకరించిన తర్వాతనే ఎస్ఐఆర్‌ను అప్‌లోడ్ చేయాలని విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

### సమాచారం లభించకపోతే:

ఒకవేళ ఎస్ఐఆర్‌కు సంబంధించిన వ్యక్తుల వివరాలు లభించకపోయినా, వారి ఇల్లు గుర్తించలేని పరిస్థితుల్లో స్థానిక నాయకులు, ప్రజలు లేదా స్థానిక రాజకీయ ప్రతినిధుల సహాయంతో పూర్తి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు నిర్ధారించుకున్న తర్వాతనే ఎస్ఐఆర్‌ను అప్‌లోడ్ చేయాలని ఆయన అధికారులను కోరారు.

## మిడ్జిల్ సభలో అస్వస్థతకు గురైన కాంగ్రెస్ నేత శంకర్ మృతి

లోకల్ గైడ్ । ఆమనగల్లు, రంగారెడ్డి జిల్లాతలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎదుల శంకర్ మంగళవారం చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతి కాంగ్రెస్ శ్రేణులను, స్థానిక ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. గత శనివారం మిడ్జిల్‌లో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభలో పాల్గొన్న శంకర్ అకస్మాత్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలారు. వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే వైద్యుల ప్రయత్నాలు ఫలించక మంగళవారం ఆయన తుదిశ్వాస విడిచారు. ఎదుల శంకర్ తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తూ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండేవారని నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు నేతలు శంకర్‌కు నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శంకర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

## వామపక్ష విద్యార్థి సంఘాల సన్నాహక సమావేశం

విద్యా రంగ సమస్యల పరిష్కారం కై ఈనెల10 న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు.




నిర్మల్ జూలై 07 (లోకల్ గైడ్) భైంసా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం వామపక్ష విద్యార్థి సంఘాల (ఏ ఐ పి ఎస్ యు, ఎస్ ఎఫ్ ఐ,పి డి ఎస్ యు, ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జూలై 10 రాష్ట్రవ్యాప్త బంద్ సన్నాహక సమావేశం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలో రోజురోజుకూ పేరుకుపోతున్న ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి, విద్యార్థుల హక్కుల సాధన కోసం వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 10వ తేదీన (జూలై 10) రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ బంద్‌కు భైంసా డివిజన్ పరిధిలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాస్వామ్యవాదులు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి, విద్యాసంస్థలను మూసివేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మరిన్ని విషయాలు ప్రస్తావిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 9000 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఇంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేయడం వల్ల లక్షలాది మంది నిరుపేద, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. కార్పొరేట్ మరియు ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలలో ఫీజుల దోపిడీ అడ్డు అదుపు లేకుండా సాగుతోందని, ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూలై 10 బంద్ అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మరియు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

### ప్రధాన డిమాండ్లు:

బకాయిల విడుదల: ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ. 9,000 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీఇంబర్స్‌మెంట్ బకాయిలను విద్యార్థుల ఖాతాల్లో తక్షణమే జమ చేయాలి. ఖాళీల భర్తీ: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ, అధ్యాపక (లెక్చరర్) నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే రెగ్యులర్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి. సొంత భవనాలు: అద్దె ఇండ్లలో మరియు ఇరుకైన గదుల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లకు తక్షణమే బడ్జెట్ కేటాయించి, ప్రభుత్వ పక్కా భవనాలు నిర్మించాలి. హాస్టళ్లలో మెస్ ఛార్జీలను పెంచాలి.

### ఉచిత సీట్ల కేటాయింపు:

విద్యా హక్కు చట్టం (ఆర్ టి ఈ) ప్రకారం అన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపును ఖచ్చితంగా అమలు పరచాలి. ఎన్ ఈ పి 2020 రద్దు: విద్యా రంగాన్ని కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేసే కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానాన్ని (ఎన్ ఈ పి 2020) తెలంగాణలో అమలు చేయకుండా రాష్ట్ర అసెంబ్లీలో తక్షణమే వ్యతిరేక తీర్మానం చేయాలి.

### పాల్గొన్న నాయకులు:

ఈ సన్నాహక సమావేశంలో ఏ ఐ పి ఎస్ యు, ఎస్ ఎఫ్ ఐ,పి డి ఎస్ యు, ఏఐఎస్ఎఫ్ సంఘాల ముఖ్య నాయకులు పరమేష్ , దిగంబర్, మహేందర్, కిరణ్,, వెంకటేష్, కైలాష్, వినయ్, సంతోష్ పెద్ద సంఖ్యలో విద్యార్థి సంఘాల కార్యకర్తలు, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పెట్రోల్ , డీజిల్ , గ్యాస్ ధరలు తగ్గించాలి ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లకు , కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి - వై విక్రమ్



లోకల్ గైడ్. ఖమ్మం.ఖమ్మం : ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ ( ఏఐఆర్ టి డబ్ల్యు ఎఫ్ - సీఐటీయూ ) ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద ప్లే కార్డ్ తో నిరసన కార్యక్రమం జరిగింది . ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై విక్రమ్ , జిల్లా ఉపేందర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురులు ధరలు తగ్గుతున్న కేంద్ర ప్రభుత్వం దేశంలో ఇంధన ధరలను పెంచి వాహనరంగంపై సామాన్య ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు . కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు బిజెపి ప్రభుత్వం ఇలా ప్రజల జేబులు ఖాళీ చేస్తుందని విమర్శించారు . కేంద్ర ప్రభుత్వము మొన్నటికి మొన్న ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత పెట్రోల్ పై 3 రూపాయలు డీజిల్ పై 3 రూపాలు పెంచింది , అట్లాగే రెండు రోజుల క్రితం 90 పైసలు డీజిల్ , పెట్రోల్ పెంచింది గ్యాస్ ధరను రూపాయి చేసింది , ఈరోజు పెట్రోల్ పై 80 పైసలు , డీజిల్ పై 80 పైసలు మళ్లీ నాలుగు రోజుల వ్యవధిలోనే పెంచింది అని ఆరోపించారు . ఇలా 4 రూపాయలు పెట్రోల్ , డీజిల్ ధరలు పెంచడం మూలంగా ఈరోజు రవాణా రంగం ఆటో , ట్రాలీ , క్యాబ్ , డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు . కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులు ఆదాని అంబానీ కొరకు 4 లేబర్ కోడ్స్ ను అమలు చేసిందని , కార్మికుల పొట్ట కొడుతుందని విమర్శించారు . వెంటనే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు . ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు వల్ల వందమంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు . కారు ట్రావెల్స్ , ఆటో, ట్రాక్టర్ , లారీ వాహనాలకు గిరాకి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు అని ఈ తరుణంలో ములిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు చందనంగా ధరలు పెంచడం తయారైందని ఈ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం అని ఆగ్రహం వ్యక్తం చేశారు . పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని , ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వాల ను డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా కోశాధికారి ధరావత్ రాందాస్ , జిల్లా కమిటీ సభ్యులు గంగుల నరసయ్య , బీమా , ఉపేందర్ , రవి , గాని , నాగేశ్వరరావు , శ్రీనివాసరావు , రాజారావు , నవీన్ మరియు ట్రాన్స్పోర్ట్ పాల్గొన్నారు .

## ఆమనగల్ కాంగ్రెస్‌కు కొత్త నాయకత్వం

**మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి.. మున్సిపల్ అధ్యక్షుడిగా శివలింగం నియామకం**



లోకల్ గైడ్ । ఆమనగల్లుకాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం, మున్సిపాలిటీకి కొత్త అధ్యక్షులను నియమించింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్ణయం మేరకు ఆమనగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవ్వారి శివలింగంలను నియమించారు. కొత్త అధ్యక్షుల నియామకంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.



పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శివలింగంలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షులు మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. జిల్లా నాయకత్వం, పార్టీ శ్రేణుల సహకారంతో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## సాయిబాబా దేవాలయంలో 17వ వార్షికోత్సవం
## స్వప్న కాలనీలో సాయినాథుని వార్షికోత్సవానికి సర్వం సిద్ధం

భక్తులకు మహా అన్నదానం



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై07 (లోకల్ గైడ్ తెలంగాణ)సుల్తానాబాద్ పట్టణంలోని స్వప్న కాలనీలో వెలసిన శ్రీ గణపతి దత్తాత్రేయ సుప్రభాత శ్రీ శిర్డీ సాయిబాబా దేవాలయంలో 17వ వార్షికోత్సవం, గురుపౌర్ణమి మహోత్సవాలను గురువారం 9న వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్,సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహక కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఉదయం 5 గంటలకు కాకడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమై గణపతి పూజ, పుణ్యాహవాచనం, సాయిబాబా విశేష అభిషేకం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, ప్రత్యేక అర్చనలు, హోమాలు, మంగళహారతులు నిర్వహించనున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహామంగళహారతి అనంతరం భక్తులందరికీ మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం, సాయంత్రం భజనలు, సత్సంగాలు, సాయిబాబా మహిమలను వివరిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి శేజ్ హారతితో ఉత్సవాలు ముగియనున్నాయి. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక పార్కింగ్, తాగునీరు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు సాయినాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆయన ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు, స్థానిక యువకులు విస్తృతంగా సహకరిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను కలిగిస్తాయని, ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా హాజరై సాయినాథుని కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగుల హాజరు ఇకపై ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా మాత్రమే నమోదు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, లోకల్ గైడ్, జూలై 7:-మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇకపై ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారానే తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన హాజరు ఆధారంగానే ఉద్యోగుల జీతాలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. తార్నాకలోని ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని విభాగాల ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానంలో నమోదు కావాలని సూచించారు. శానిటేషన్ విభాగానికి చెందిన ఉద్యోగుల వివరాలను వెంటనే సేకరించి ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరు నమోదులో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. అనధికారికంగా విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాంకేతికత వినియోగంతో సేవల నాణ్యత, పనితీరును మరింత మెరుగుపరచడమే ఈ విధానం అమలు లక్ష్యమని తెలిపారు.

## టీపీసీసీ స్ సి సెల్ రాష్ట్ర కార్యదర్శి గా నియమితులైన న్యాయవాది ఆరెపల్లి రాహుల్ ని సన్మానం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్.




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై 07 (లోకల్ గైడ్ తెలంగాణ)సుల్తానాబాద్ పట్టణానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరెపల్లి రాహుల్ టీపీసీసీ స్ సి సెల్ రాష్ట్ర కార్యదర్శి గా నియామకమైన సందర్భంగా ఆరెపల్లి రాహుల్ ని సన్మానించిన బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పొద్నాల రవీందర్, ఉపాధ్యక్షులు ఆవుల శివ కృష్ణ, ఏజీపీ అంజన్న, న్యాయవాదులు పడాల శ్రీరాములు, భూమయ్య, అంబాల నర్సయ్య, రవికిరణ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## రూ.338 కోట్లతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.



లోకల్ గైడ్, ( రంగారెడ్డి జిల్లా బ్యూరో ): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో రూ. 338 కోట్లతో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ప్రజలు కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ. 85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ. 275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ. 100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ. 338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డిపాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ. 338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ. 275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ. 2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టి యూ ఎఫ్ ఐ డి సి ) చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్



అదిలాబాద్ జిల్లా జూలై 7 లోకల్ గైడ్మంగళవారం భీంపూర్ మండలం బేల్సారి రాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు కోవా వనిత - జ్ఞానేశ్వర్ దంపతుల గృహ ప్రవేశానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలను కలెక్టర్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటి నిర్మాణ ఖర్చులను, గృహ నిర్మాణ శాఖ ద్వారా ప్రభుత్వ ఆర్థిక సహాయం చెల్లింపులపై ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి శంకర్, తహసీల్దార్, డిఈ రమేష్, ఏఈ బావుసింగ్, సర్పంచ్ కేశవ్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతంలో నూతన పాఠశాల భవనం ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



అదిలాబాద్ జిల్లా జూలై 7 లోకల్ గైడ్గిరిజన విద్యార్థులకు వారి ఆవాసాల్లోనే నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం భీంపూర్ మండలం టెక్డిగూడ గ్రామంలో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించి, వారి నైపుణ్యాలకు సంతృప్తి చెంది అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో శిథిలావస్థకు చేరిన భవనం వల్ల హనుమాన్ ఆలయ మందిరంలో నడిచిన బెల్సాయి రాంపూర్, టేకడి రాంపూర్ గిరిజన ప్రాథమిక పాఠశాలను, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు త్వరితగతిన నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాథమిక దశలోనే పిల్లలు భాషా నైపుణ్యాలు, ప్రాథమిక గణితం నేర్చుకుంటే ఉన్నత చదువులకు సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలను రోజూ బడికి పంపాలని, ఉపాధ్యాయులు ఇచ్చే హోంవర్క్ చేసేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. పాఠశాలలో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇస్తూ, భవన నిర్మాణానికి సహకరించిన ఐటీడీఏ, ఇంజనీరింగ్ అధికారులు, గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటి, ఇంటింటికి ఐదు మొక్కల చొప్పున గ్రామస్థులకు అందజేశారు.అనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతినీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రారంభం కాని ఇళ్లను పక్షం రోజుల్లోగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమాలలో ఏటిడిఓ నిహారిక, హౌసింగ్ పిడి శంకర్, తహసీల్దార్ రమేష్, ఏంఈఓ రాధాకృష్ణ, సర్పంచ్ కేశవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి:కలెక్టర్ రాజర్షి షా



అదిలాబాద్ జిల్లా జూలై 7 లోకల్ గైడ్ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పుల్లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రమైన భీంపూర్తో పాటు, గోన గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు, బీఎల్ఓ ద్వారా గ్రామాల వారీగా ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిన గైర్హాజరు, వలస వెళ్లిన వారు, మరణించిన ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను స్వయంగా తనిఖీ చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలని, 18 ఏళ్లు నిండిన నూతన ఓటర్ల నుంచి 'ఫారం-6' ద్వారా దరఖాస్తులు స్వీకరించి, వారి పేర్లను నమోదు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా గోన గ్రామ పంచాయతీ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, సూపర్వైజర్లు నర్సింహులు, విజయ్ కుమార్, స్థానిక సర్పంచ్ రంజానతో పాటు బీఎల్ఓలు, గ్రామ రెవెన్యూ సిబ్బంది, ఓటర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి:

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అదిలాబాద్ జిల్లా జులై 7 లోకల్ గైడ్ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా అందించడమే లక్ష్యంగా రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.మంగళవారం ఈదులసావర్గామ్ నుంచి నిపాని మీదుగా అర్లీ(టీ) వరకు రూ.18 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూ.5 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం రూ.3 కోట్ల వ్యయంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రహదారిని పునర్నిర్మిస్తున్న పనులను ఆయన పరిశీలించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రహదారి పనుల కారణంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసి, త్వరితగతిన రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్ను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నర్సయ్య, కాంట్రాక్టర్ నవీన్, సుమన్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వార్థ ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం

ఎండాకాలంలో నిర్మాణం చేస్తే వాన కాలంలో కూలిపోయే ప్రాజెక్టులు బిఆర్ఎస్ కట్టినవి

రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ హయాంలోనివే

ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జులై 07 (లోకల్ గైడ్ తెలంగాణ) పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు.సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా బిఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ప్రాజెక్టులపై రైతులకు ప్రజలకు విష ప్రచారాన్ని చేరవేస్తున్నారని అవి ఎవరి ప్రయోజనాల కోసం చేస్తున్నారో ప్రజలకు, రైతులకు తెలుసని అన్నారు. రైతన్నకి అవసరమైన నీరు అందించేందుకు పైపుల ద్వారా ఎత్తిపోసే అవసరం లేకుండానే తుమ్మిడి హెట్టిని ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తూమ్మిడి ఎట్టి నుండి ఎల్లంపల్లి కి నీరును తీసుకువచ్చే విధంగా రూపకల్పన చేపట్టారని తెలిపారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఒక లక్ష కోట్ల రూపాయలతో ప్రజా ధనాన్ని వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ తమ స్వార్థ ప్రయోజనాల కోసం వారి కుటుంబ ప్రయోజనాల కోసం నిర్మాణం చేపట్టారని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా నీళ్లను కింది నుండి పైకి ఎత్తిపోసే ప్రాజెక్ట్ కెసిఆర్ ఇంజనీర్ అవతారం ఎత్తి నిర్మించారని ఆ ప్రాజెక్టు నాలుగు నుండి ఐదు సంవత్సరాల కాలంలో ఒక సంవత్సరానికి 180 టీఎంసీల చొప్పున నీళ్ళు ఎత్తి పోసారని అబదప్పు మాటలు చెప్పి పబ్బం గడిపారు. అలా అయితే ఐదు సంవత్సరాల కాలంలో 900 టీఎంసీల నీరును పోయాల్సి ఉండగా 74.5 టిఎంసిల నీళ్లను మూడు ప్రాంతాలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లిఫ్ట్ ల ద్వారా ఎల్లంపల్లికి పంపిణీ చేసి ఎల్లంపల్లి లో ఉన్న 40 టీఎంసీల నీరును కలుపుకొని కేవలం 114 టీఎంసీల నీళ్లను ఐదు సంవత్సరాలలో ఎత్తిపోసారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణ మానస పుత్రిక అని, ప్రపంచంలో ఎనిమిదో వింత అని సొంత బస్సులలో రైతులను, ప్రజలను తరలించి టూరిజం ప్రాజెక్టుగా చూపించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఎస్సారెస్పీ ఎల్లంపల్లి వరద కాలువల ద్వారా ఈ రాష్ట్ర రైతాంగానికి కాళేశ్వరం తో సంబంధం లేకుండా గతంలో ఎన్నడు లేని విధంగా 83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతంగం పండించేందుకు నీరును అందించడం జరిగిందన్నారు. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఉన్న సమయంలో 200 కోట్లతో వరద కాలువలకు శంకుస్థాపన చేపట్టారని అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వరద కాలువలను పూర్తి చేసి ఎస్సారెస్పీ ద్వారా రెండు డ్యాములు నింపారని తెలిపారు. తుమ్మిడి ఎట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణానికి వైయస్ రాజశేఖర్ రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఐదున్నర కోట్ల రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు పెట్టి వరద కాలువల నిర్మాణం చేపట్టిందని 182 కిలోమీటర్ల పైన కాలువల నిర్మాణం పూర్తయిందని వివరించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు లేఖ ఇచ్చారని వివరించారు. మీ పాలనలో ఎండాకాలంలో ప్రాజెక్టులు మొదలుపెడితే వానకాలంలో కూలిపోయే పరిస్థితిలో నెలకొన్నాయని దానికి నిదర్శనమే కాళేశ్వరం ప్రాజెక్టు అని వివరించారు. హుస్సేమియా వాగులపై నిర్మాణం చేసిన చెక్ డ్యాముల సైతం కూలిపోయాయి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలను బయట పెడుతుంటే అప్పటి మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ని అడ్డుకున్న చరిత్ర బిఆర్ఎస్ పార్టీ వరిదని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి, ధర్మారం, మంథని ప్రాంతాలకు నీళ్లు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులన్ని నాగార్జునసాగర్, పులిచింతల, హుస్సేన్ సాగర్, శ్రీశైలం, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మిడ్ మానేరు లోయర్ మానేరు ఏకశిలా, ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణమయ్యాయని ఇప్పటివరకు చెక్కుచెదరకుండా ఉన్నాయని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మా ప్రాంతాల నుండి నీళ్లు తీసుకుపోయి మీరు ఈ ప్రాంతంలో వాడుకున్నదీ నిజం కాదా అని ప్రశ్నించారు. పెద్దపల్లి టేలెంట్ ప్రాంతం పూర్తిగా బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఎండిపోయిందని ఎద్దేవా చేశారు. అబద్దాలను ప్రజలకు చెప్పడం మానేసి అవసరమైన సలహాలు సూచనలు అందించాలే తప్ప మోసపు మాటలు చెప్పడం మానుకోవాలని అన్నారు. హరీష్ రావు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతం సశ్యామలమవుతుందని అబద్ధపు మాటలు చెప్పారే తప్పా ఈ ప్రాంతానికి నీరు అందించిన దాఖలాలు లేవన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచ్లు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు."

## మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ ఉత్సవాలు మరియు మందకృష్ణ మాదిగ గారి 62వ బర్త్ డే సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి ఆనంద్ మాదిగ గారి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరేసి పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ గారి బర్త్ డే కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్ మాదిగ గారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎంతో గొప్పదని దానికి ఉదాహరణగా మొన్నటికి మొన్న 70 ఏళ్లుగా ప్రభుత్వాలు మాదిగ మాదిగ ఉప కులాల వెనుకబాటుతనాన్ని తీసేయడంలో విఫలమైతున్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన గౌరవ చంద్ర చూడ్ గారు వాదనలు వింటున్న సందర్భంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల తరపున మాట్లాడుతున్న న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతూ 70 ఏళ్లుగా ఈ సమస్యకు పరిష్కారం చూపించడానికి మీ దగ్గర ఎలాంటి మెకానిజం లేనందుననే మాదిగ మాదిగ ఉప కులాలు రిజర్వేషన్లకు కూడా నోచుకోలేని పరిస్థితిలో ఉండి సామాజిక న్యాయానికి చాలా దూరంగా ఉన్నారని గుర్తు చేయడం జరిగింది . అంటే దీనికి పరిష్కారం ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఉద్యమం గుర్తించి కోర్టు ద్వారా ఇలాంటి పరిష్కారం వచ్చిందంటే అది ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎంత గొప్పదో మనకు అర్థమవుతుంది అంతేకాకుండా ఎమ్మార్పీఎస్ ఉద్యమం ద్వారా మాదిగ మాదిగ ఉపకులాలకు మాత్రమే కాకుండా మాల ఉపకాల కులాలకు కూడా మునుపెన్నడూ లేని విధంగా సామాజిక న్యాయం అందుతుందంటే అది ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితం అంతేకాకుండా ఎలాంటి ప్రభుత్వ పదవులు అనుభవించని మందకృష్ణ మాదిగ గారు కేవలం ఎమ్మార్పీఎస్ ఉద్యమం ద్వారానే ఆకలికేకల పోరాటంతో అందరికీ సరైన మూడు పూటలా భోజనం దొరికే సదుపాయం కల్పించడానికి కారకులైనారు అంతేకాకుండా వృద్ధులు వితంతువులు, వికలాంగుల పెన్షన్ల సాధకుడు మందకృష్ణ మాదిగ గారు అంతేకాకుండా ఈరోజు ఆరోగ్యశ్రీ కార్డు పథకం కులాలకు అతీతంగా ప్రతి ఇంట్లో ఉందంటే అది ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితం అని సభండవర్ణాలు దానివల్ల లబ్ధి పొందుతున్నాయి ఎమ్మార్పీఎస్ ఉద్యమం మరియు ఎమ్మార్పీఎస్ కార్యకర్తల త్యాగం మరువలేనిదని మాదిగలు ఉన్నంతకాలం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల త్యాగం గుర్తుండిపోతుందని ఈ సందర్భంగా మాట్లాడడం జరిగింది ఇప్పటికైనా ఎప్పటికైనా ఎమ్మార్పీఎస్ సమాజంలో ఎక్కడ అసమానతలతో బాధపడుతుంటారో అక్కడ ముందుండి పోరాటం చేసి వారికి సామాజిక న్యాయాన్ని అందిస్తాదని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్దలు మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ అదేవిధంగా మాజీ ఎమ్మార్పీఎస్ నాయకులు పెండ్యాల అనంతయ్య మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు పుష్పరాణి సునీత ఎం ఎస్ పి నాయకులు కిష్టయ్య, దారూర్ మండల అధ్యక్షులు పి నందు, వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ ప్రధాన కార్యదర్శి సురేష్ సీనియర్ నాయకులు పిల్లికండ్ల అనంతయ్య విహెచ్ఎస్ నాయకులు శ్యాం ప్రసాద్ రాజు బాల్రాజ్ శ్రీనివాస్ మధు తదితరులు పాల్గొన్నారు

## నేడు వనపర్తి లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన.

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి .




వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి జులై 7: వనపర్తి నియోజక వర్గంలో బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రెండు కోట్ల లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. రూ: 10 కోట్లతో చేపట్టనున్న పాలిటెక్నిక్, రాజ గారి బంగ్లా పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన వెల్లడించారు. అనంతరం రేవల్లి మండల కాంప్లెక్స్ సముదాయ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని ఆయన వెల్లడించారు .ఆ తరువాత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూరిగుడిసెలు ఉన్న నిరుపేదలకు 2 వ విడత ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రోసిడింగ్ కాపీలను అందజేస్తారని ఆయన తెలిపారు .అదే విధంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడెంట్ కాపీలను అందజేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టరేట్ లో ని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడుతారని ఆయన పెర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి .జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి , మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణాధ్యక్షులు, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం, బీ ఎల్ ఓ లు, సింగిల్ విండో అధ్యక్షులు ఉపాధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, జిల్లా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అనుబంధ సంఘాల నాయకులు అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా సమైక్య సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ ధాన్యాన్ని దోచుకునే వారిపై ఉక్కుపాదం..

సీఎంఆర్ బియ్యం అక్రమ దారి మళ్లింపు నిందితుడిపై పీడీ యాక్ట్ అమలు

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించం:పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై 07 (లోకల్ గైడ్ తెలంగాణ) ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఆహార భద్రతా పథకాలకు భంగం కలిగిస్తూ, ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారి మళ్లించి ప్రజల హక్కులను హరిస్తున్న వారిపై రామగుండం పోలీస్ కమిషనరేట్ రాజీ లేని వైఖరిని అవలంబిస్తోంది. ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం కలిగించడమే కాకుండా,ప్రజలకు అందాల్సిన నిత్యావసర ధాన్య సరఫరా వ్యవస్థను దెబ్బతీసే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో,కరీంనగర్ జిల్లా కట్టరాంపూర్కు చెందిన బండారి మారుతి (43), కాట్నపల్లిలోని సాయి మహాలక్ష్మి ఇండస్ట్రీస్, సౌభాగ్యలక్ష్మి ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్ట్నర్పై ప్రివెన్షన్ ఆఫ్ బ్లాక్ మార్కెటింగ్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ సప్లైస్ ఆఫ్ ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్--1980 కింద ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ అమలు చేయబడింది.పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈరోజు సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. రంజిత్రావు, సుల్తానాబాద్ సబ్ఇన్స్పెక్టర్ చంద్రకుమార్ కరీంనగర్ జిల్లా జైలుకు వెళ్లి,జైలర్ సమక్షంలో నిందితుడికి పీడీ యాక్ట్ ఉత్తర్వులను అందజేసి,అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, 2023--24 రబీ, ఖరీఫ్ సీజన్లలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థతో కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం కుదుర్చుకున్న నిందితుడు మొత్తం 11,213.040 మెట్రిక్ టన్నుల వరిని స్వీకరించి, ప్రభుత్వానికి అప్పగించాల్సిన 7,624.867 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయకుండా అక్రమంగా ఇతర రైస్ మిల్లులకు విక్రయించినట్లు తేలింది.ఈ చర్యల వల్ల ప్రభుత్వానికి రూ.27 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది.నిందితుడిపై 2024 నుంచి 2026 వరకు పెద్దపల్లి,కరీంనగర్ జిల్లాల్లో నాలుగు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ కేసులో అరెస్టై బెయిల్పై విడుదలైన అనంతరం కూడా అదే తరహా నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.ప్రస్తుతం మరో కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అతను తిరిగి విడుదలైతే మళ్లీ ప్రజా పంపిణీ వ్యవస్థకు భంగం కలిగించే అవకాశం ఉన్నందున, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,"ప్రభుత్వ ధాన్యం అనేది పేదల హక్కు. ఆ ధాన్యాన్ని అక్రమంగా దోచుకుని బ్లాక్ మార్కెట్కు తరలించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించము.ప్రజల ఆహార భద్రతకు భంగం కలిగించే వారిపై సాధారణ క్రిమినల్ కేసులతోనే ఆగిపోము. అవసరమైతే పీడీ యాక్ట్తో పాటు చట్టంలో ఉన్న అత్యంత కఠిన నిబంధనలను అమలు చేస్తాము. సీఎంఆర్ బియ్యం అక్రమ దారిమళ్లింపులో పాల్గొన్న ప్రతి వ్యక్తిని, నిర్వాహకుడిని, సహకరించిన వారిని, లబ్ధి పొందిన వారిని గుర్తించి చట్టం ముందు నిలబెడతాము. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారిమళ్లించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. అక్రమాలకు పాల్పడే వారు వెంటనే తమ కార్యకలాపాలను విరమించుకోవాలి. లేకపోతే పీడీ యాక్ట్తో పాటు కఠినమైన చట్టపరమైన నిర్బంధ చర్యలు తప్పవు." అని హెచ్చరించారు.ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం,నిల్వ చేయడం,రవాణా చేయడం, విక్రయించడం లేదా ఇటువంటి నేరాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించే వారిపైనా సమానంగా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.ఈ కేసులో పీడీ యాక్ట్ అమలుకు కృషి చేసిన పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, సుల్తానాబాద్ సీఐ పి. రంజిత్రావు,ఎస్సై చంద్రకుమార్లను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## సత్తుపల్లి పట్టణం క్యాంప్ కార్యాలయం లో



లోకల్ గైడ్. సత్తుపల్లి) మండలం మరియు సత్తుపల్లి పట్టణంలో ట్రాన్స్ ఫర్ లు మరియు ప్రమోషన్లు జరిగిన అంగన్వాడి టీచర్లకు, అంగన్వాడి ఆయాలకు ఆర్డర్ కాపీలను అందించిన. సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్., రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ గారు మరియు సీడీపీఓ సత్యవతి గారు...

## విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు
## కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టీకరణ
## మునిపల్లి జ్యోతిబాపూలే కళాశాల ఆకస్మిక తనిఖీ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 07 : వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, కళాశాలల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం



చేశారు. జక్రాన్పల్లి మండలం మునిపల్లిలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్/డిగ్రీ కళాశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ, తరగతి గదులు తదితర వాటిని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, సదుపాయాల గురించి ఆరా తీశారు. వంట గది, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ అపరిశుభ్రంగా ఉంది, ఈగలతో నిండి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రత గురించి పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నందున, ఏజెన్సీని మార్చాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ముప్పిరిగొనే ప్రమాదం ఉన్నందున పరిశుభ్రత విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణలో రాజీ పడవద్దని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపిస్తూ, శుచి, శుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం బై.పీ.సీ తరగతి గదిని సందర్శించి, విద్యార్థినులతో భేటీ అయ్యారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ తదితర సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, విద్యార్థినుల నుండి సమాధానాలు రాబట్టారు. ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ అనూష తదితరులు ఉన్నారు.

## మహిళా సమైక్య భవనానికి భూమి పూజ

నారాయణపేట జూలై 8(లోకల్ గైడ్ ),:నారాయణపేట మండయులం పేరపల్ల కింది తండాలో మంగళవారం ఎమ్మెల్యేడాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పెరపల్ల కింది తండా లో సర్పంచ్ సోనా బాయ్ సురేష్ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య భవన్ భూమి పూజ కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ శరణప, గ్రామ పంచాయతీ సెక్రటరీ రాకేష్ సీసీ వసంత మేడం గారు గ్రామ మహిళా సంఘం అధ్యక్షులారు దేవుల బాయి,గ్రామ మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్ గ్రామ పెద్దలు యూవకులు పాల్గొన్నారు

### పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటా :ఎస్పీ
### మృతి చెందిన హోంగార్డ్ కుటుంబానికి 50 వేల ఆర్థిక సహాయం




నారాయణపేట జూలై 7(లోకల్ గైడ్ ),: నారాయణపేట జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బాలకృష్ణ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ మానవతా దృక్పథంతో అండగా నిలిచి హోంగార్డు లు సేకరించిన విరాళం. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ చేతుల మీదుగా మృతుడి భార్య భవానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.నారాయణపేట జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహించిన బాలకృష్ణ, కొత్తపల్లి మండలం గోకుల్ నగర్‌కు చెందినవారు. ఆయన ఆకస్మిక మరణంతో భార్య భవాని, ముగ్గురు చిన్నారులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న హోంగార్డ్ అధికారులు, సిబ్బంది, బ్యాచ్ మిత్రులు తమ తోటి సహచరుడి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ పోలీస్ కుటుంబంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు అందరూ ఒక్కటిగా నిలబడటం పోలీస్ శాఖ గొప్ప సంప్రదాయమని అన్నారు. బాలకృష్ణ సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అలాగే, తమ సహచరుడి కుటుంబానికి చేయూత అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన హోంగార్డ్ అధికారులు, సిబ్బంది, బ్యాచ్ మిత్రులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవాభావం, మానవత్వం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.మృతుడి కుటుంబ సభ్యులు ఈ ఆర్థిక సహాయం అందించిన జిల్లా ఎస్పీతో పాటు హోంగార్డ్ అధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హోంగార్డ్ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## సింగారం గ్రామంలో
## రైతులకు వ్యవసాయ అవగాహన శిబిరం



నారాయణపేట జూలై 7:నారాయణపేట మండలం సింగారం గ్రామంలో మంగళవారం రైతు చట్టాలపై అవగాహన శిభిరం నిర్వహించారు. ఈ శిబిరానికి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం, పంటల బీమా తీసుకోవడం, డ్రిప్ ఇరిగేషన్ వంటి పద్ధతుల ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గించి లాభాలు పెంచుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రీయ మరియు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ఇది మన ఆరోగ్యానికి, భూసారాన్ని కాపాడటానికి ఎంతోఉపయోగపడుతుందన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, పోక్సో చట్టం, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి కూడా అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్ ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ నాగిరెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మప్ప, కానిస్టేబుల్, డి. జయప్రకాశ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాజేందర్ నగర్ లోని ఈవీఎం గోడౌన్ ను
## సందర్శించిన జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి .




లోకల్ గైడ్, ( రాజేంద్ర నగర్ ): రాజేంద్ర నగర్ లోని ఈ వీ ఎం గోడౌన్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మంగళవారం సందర్శించారు.సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి. ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ ఆర్డిఓ, తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి.

(లోకల్ గైడ్( రంగారెడ్డి జిల్లా బ్యూరో ): ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని ఆర్డీవోలు, జోనల్ మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీఓలు, ఎంపీఓలు, సీడీపీఓలు, మెప్మా అధికారులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 92 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, మిగిలిన ఫారాల పంపిణీని ఈరోజు సాయంత్రంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ ఓ లు ) ప్రజల నుంచి నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సేకరించి, వెంటనే సంబంధిత యాప్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అనర్హులను ఓటరు జాబితా నుంచి తొలగించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన మేర ప్రత్యామ్నాయ సిబ్బందిని గుర్తించాలని, ఫారాల నింపడం, పరిశీలించడం, డిజిటలైజేషన్ పనుల కోసం ఉపాధ్యాయులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అదనపు సిబ్బంది, వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం రెండు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ఎన్నికల నమోదు అధికారులు (ఈ ఆర్ ఓ లు ) సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏ ఈ ఆర్ ఓ ) లు ప్రతి పోలింగ్ కేంద్రంలో బలమైన బృందాలను ఏర్పాటు చేసి ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని తెలిపారు. ఈరోజు నుంచే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, రేపటి నుంచి గ్రామాలు, మున్సిపల్ వార్డుల స్థాయిలో సర్ ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించాలని సూచించారు. ఫారాల నిర్వహణలో పూర్తి



పారదర్శకత పాటించాలని, బీఎల్‌ఓలు ఫారాలను సక్రమంగా స్వీకరించి ప్రత్యేకంగా నియమించిన సిబ్బందితో పరిశీలింపజేసి, అనంతరం సంబంధిత యాప్‌లో డిజిటలైజ్ చేసి భద్రపరచాలని ఆదేశించారు. ప్రతి దశకు సంబంధించిన మాన్యువల్ రికార్డులను కూడా తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు కనీసం 20 శాతం పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని, రాబోయే ఐదు రోజుల్లో 100 శాతం లేదా కనీసం 90 శాతం ప్రక్రియ పూర్తి చేసే లక్ష్యంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. మండల స్థాయి సీనియర్ అధికారులు పోలింగ్ కేంద్రాలను వర్గీకరించి, అవసరాన్ని బట్టి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను రేపటి నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ మొత్తం ప్రక్రియను జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబితా సిద్ధమైన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను సేకరించి సంబంధిత నివేదికను జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలోని ప్రతి ఆర్డీవో, జోనల్ మున్సిపల్ కమిషనర్లతో విడివిడిగా మాట్లాడి, వారి కార్యాచరణ ప్రణాళికలను సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

# అధిక లాభాలు అందించే ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి

**అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు**

**ఆయిల్ పామ్ సాగు అన్ని విధాలుగా శ్రేయస్కరం : స్వీయ అనుభవాన్ని వెల్లడించిన ఆదర్శ రైతులు**

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 07 : అధిక దిగుబడి, మంచి మద్దతు ధరతో గణనీయమైన లాభాలను అందించే ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు జిల్లాలోని ఆదర్శ రైతులు చొరవ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. మాక్లూర్ మండలం చిన్నాపూర్ రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం స్థానిక రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, సంప్రదాయ వరి పంట స్థానంలో ఆయిల్ పామ్ సాగు చేపడితే కలిగే ప్రయోజనాల గురించి అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టి దిగుబడులు పొందుతున్న ఆదర్శ రైతులు జైడి మధుసూదన్, లక్ష్మణ్, గడ్డం గంగారెడ్డి, సుధాకర్ తదితరులు తమ స్వీయ అనుభవాలను తోటి రైతులకు తెలియజేశారు. ప్రభుత్వ సబ్సిడీతో తాము ఆయిల్ పామ్ పంట సాగు చేశామని, ప్రస్తుతం మంచి దిగుబడి చేతికి వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అంతర పంట సాగు ద్వారా అదనపు ఆదాయాన్ని సైతం ఆర్జించడం జరిగిందని వివరించారు. డ్రిప్ ఏర్పాటు కోసం 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వమే డ్రిప్ పరికరాలను సమకూర్చిందని అన్నారు. తాము సహచర ఆదర్శ రైతులు కలిసి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాలకు వెళ్లి ముందుగా ఆయిల్ పామ్ సాగును అధ్యయనం చేశామని, ఏ రకంగా చూసినా ఈ పంట అధిక లాభాలు అందిస్తుందని గమనించి తాము కూడా ఆయిల్ పామ్ సాగు చేశామన్నారు. వరి, పసుపు వంటి పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగు ఎంతో శ్రేయస్కరం అని నిరూపితం అయ్యిందని రైతులు తమ స్వీయ అనుభవాన్ని తోటి రైతులతో పంచుకున్నారు. బైబ్యాక్ ఒప్పందాన్ని అనుసరిస్తూ, ప్రీ-యూనిక్ కంపెనీ వారు మద్దతు ధర చెల్లిస్తూ కలెక్షన్ సెంటర్ల ద్వారా ఆయిల్ పామ్ పంట దిగుబడిని సేకరిస్తున్నారని అన్నారు. పంట సాగులో తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, పైపెచ్చు ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగుకు శ్రమ, ఖర్చు కూడా ఎంతో తక్కువ అని తన వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మిగితా రైతులు కూడా ఇదే స్ఫూర్తితో ఆయిల్ పామ్ సాగును చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ పంట సాగుకు జిల్లాలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని, పంట సాగుకు అవసరమైన ఆయిల్ పామ్ మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ సీజన్ లో 1600 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, రైతుల




ప్రయోజనార్థం కనీసం 2000 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగును ప్రోత్సహించాలని నిర్ణయించామని అన్నారు. స్థానికంగా జిల్లాలోనే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కూడా ఏర్పాటు కానుందని, ఇప్పటికే ఆయిల్ పామ్ దిగుబడుల సేకరణ కోసం కలెక్షన్ సెంటర్లను అందుబాటులో ఉంచామని గుర్తు చేశారు. వరి సాగు వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, ప్రధానంగా కూలీల కొరతతో అవస్థలకు గురి కావాల్సి వచ్చిందని అన్నారు. అంతేకాకుండా ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు ఎంతో శ్రేయస్కరమని ఈ పంట ప్రయోజనాల గురించి ప్రతి రైతు అవగాహన కల్పించుకుని నూతనత్వం కోసం, ప్రయోగాత్మక పద్ధతిలో అయినా సాగుకు ముందుకు రావాలని సూచించారు. వంట నూనె తయారీతో పాటు ఇతర అనేక ఉత్పత్తుల్లో వినియోగించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే, రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని, ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. ఈ పంట సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు సాలీనా 4200 రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఇన్ పుట్ సబ్సిడీని రైతు ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ ను 90 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తోందని, ఆయిల్ పామ్ మొక్కలపై కూడా సబ్సిడీని అందిస్తోందని అన్నారు. ఆయిల్ పామ్ బోర్డు ఉన్నందున పంట అమ్మకం, మద్దతు ధర విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన పని లేదన్నారు. మొక్కలు అందించిన కంపెనీలే, బోర్డు ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేస్తాయని తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను పొందవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు ఉన్న డిమాండ్ ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రూ. లక్షన్నర నుండి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం ఆర్జించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక్కసారి ఆయిల్ పామ్ సాగు చేపడితే, కనీసం ముప్పై సంవత్సరాల పాటు ఈ పంట ద్వారా గణనీయమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుకు ఉపయోగపడే ఆధునిక పరికరాలను సబ్సిడీపై అందించేలా చొరవ చూపుతామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తిని కనబరుస్తూ, అవగాహన సదస్సులో కలెక్టర్ సమక్షంలోనే డీ.డీలు చెల్లించేందుకు ముందుకు రాగా, కలెక్టర్ వారిని అభినందించారు. అదేవిధంగా ఆయిల్ పామ్ సాగు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న బాశెట్టి గంగాధర్, రాహుల్ రాజ్, బాశెట్టి లక్ష్మణ్ తదితర రైతులను ఘనంగా సన్మానించారు. ఆయిల్ పామ్ పంట దిగుబడులతో కూడిన ఉత్పత్తులు, అధునాతన వ్యవసాయ పరికరాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను రైతులకు కలిసి సందర్శించారు. ఈ సదస్సులో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ప్రీ-యూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### ఎన్కతల ఘనంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

ఎన్కతల మాజీ సర్పంచ్ మీనపల్లి అనంతయ్య



లోకల్ గైడ్,మోమిన్ పేట్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి :పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామంలో మాజీ సర్పంచ్ మీనాపల్లి అనంతయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ గారి , కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాదిగ సమాజ హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం మందకృష్ణ మాదిగ గారు చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మీనపల్లి అనంతయ్య మాధిగ, ఆర్కతల అనంతయ్య మాధిగ,డప్పు పోచయ్య కక్కేనిగారి కృష్ణ రామయ్య మాజీ ఉప సర్పంచ్ నర్సింలు,జనార్దన్ హనుమంతు, డప్పు శ్యామ్ మాజీ సైనికుడు అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు టి .రమేష్ టి.ఆనంద్ ఎస్ అంబేద్కర్ అధ్యక్షులు చిట్టిబాబు డి.రమేష్ కన్నయ్య,భారత్, ప్రభు,దర్శన్ అనిల్ సమ్మయ్య మల్లేశం గ్రామ పెద్దలు చిన్నలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం. - జిల్లా కార్యదర్శి బి భరత్ కుమార్ మాదిగ.



లోకల్ గైడ్/బంట్వారం: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా కార్యదర్శి బి. భరత్ కుమార్ సంస్థ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు, మాదిగల హక్కుల పరిరక్షణ కోసం ఎంఆర్పీఎస్ మూడు దశాబ్దాలుగా నిరంతర ఉద్యమాలు కొనసాగిస్తోందన్నారు. సామాజిక న్యాయం సాధించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తూ సంస్థ ఆశయాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని, హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం, గ్రామ అధ్యక్షుడు బి. రమేష్, ఉపాధ్యక్షుడు ఎం. కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కే. ఆనంతి, కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ మరింత వేగవంతం కావాలి

# జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు జిల్లా జూలై 07 గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్ ప్రక్రియ మరింత వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు. మంగళవారం సర్ డిజిటైజేషన్ ప్రక్రియ అంశం పై కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటైజేషన్ ప్రక్రియలో పాణ్యం 53.38%, కర్నూలు 48.64%, ఆదోని 51.37% ఉందని, మిగతా నియోజకవర్గాలు ఇప్పటికే 60% దాటగా, పత్తికొండ 64%, కోడుమూరు 65.83%, ఆలూరు 65.10%, 65% లక్ష్యానికి చేరుకున్నాయన్నారు.. పాణ్యం, కర్నూలు మరియు ఆదోని నియోజకవర్గాల ఈ ఆర్ ఓ లు అదనపు కృషి చేసి, ప్రస్తుత స్థాయి నుంచి 65% వరకు పనితీరును పెంచాలని కలెక్టర్ సంబంధిత ఈఆర్ఓ లను ఆదేశించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో ఈరోజు సాయంత్రం నాటికి ఏ ఒక్క పోలింగ్ కేంద్రం కూడా 40 శాతం కంటే తక్కువ పురోగతితో ఉండకూడదన్నారు.. బుక్ ఏ కాల్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ లెవల్ ఏజెంట్లను తప్పనిసరిగా బీఎల్ఓలకు సహకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రక్రియ పూర్తిచేయడంలో ఈ వారం అత్యంత కీలకమైనదన్నారు. అందువల్ల ప్రతి ఓటరును కవర్ చేయాలనే లక్ష్యంతో అన్ని రాజకీయ పార్టీల బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలన్నారు. ఇప్పటికే ఈ అంశాలను రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి చెప్పి ఉంటారని, ఒకవేళ ఇంకా నిర్వహించకపోతే, ఈరోజే అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేసి, బీఎల్ఏలు బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించేలా సూచనలు ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ ఆయా బీఎల్ఓలకు వారి పరిధిలో ఉన్న ఆర్పీలు సహకరించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, మెప్మా పీడీ లను ఆదేశించారు. ప్రతి ఎస్ హెచ్ జీ మెంబర్ కుటుంబానికి సంబంధించిన వెల్లి, ఫామ్స్ కలెక్ట్ చేసి, బిఎల్ఓ లకు ఇచ్చే బాధ్యత ఆర్పీ లు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. టెలి కాన్ఫరెన్స్ లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు వేలం కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

– వర్జీనియా పొగాకు కొనుగోళ్లపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష



అమరావతి, జూలై 07 వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక సంక్షేమ, విద్యుత్, రెవెన్యూ శాఖల మంత్రులతో పాటు టొబాకో బోర్డు చైర్మన్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆక్షన్ ప్లాట్‌ఫార్మ్‌ల పరిస్థితి, కొనుగోళ్ల పురోగతి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈ నెల 9న టొబాకో బోర్డు కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధిక రిజెక్షన్ నమోదవుతున్న ఆక్షన్ ప్లాట్‌ఫార్మ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పొగాకు వేలం కేంద్రాలను సంబంధిత సహచర మంత్రులు స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడాలని, కంపెనీల సిండికేట్ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఆక్షన్‌లలో పాల్గొనకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా, వర్జీనియా పొగాకుకు న్యాయమైన ధరలు లభించే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టోబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, చైర్మన్ చిడిపోతు యస్వంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం మొక్కుబడి కాదు, హరిత ఉద్యమం కావాలి:

## అధికారులకు కమిషనర్ మయూర్ అశోక్ దిశానిర్దేశం.



గుంటూరు జులై 07 నగరాన్ని పచ్చదనంతో సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాబోయే జూలై 31వ తేదీ లోపు నగరంలో అవెన్యూ ప్లాంటేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్, పార్క్ విభాగాల అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో ఏడిహెచ్ శాంతి, ఏఈ నాసరయ్యలతో ప్లాంటేషన్ పై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాంటేషన్ ని మొక్కుబడి కార్యక్రమంలా కాకుండా, నగర ప్రజల భాగస్వామ్యంతో ఒక హరిత ఉద్యమంలా సాగాలని ఆకాంక్షించారు. ఇందుకోసం స్థానిక నివాసితులు, స్వచ్ఛంద సంస్థలు మరియు మొక్కల ప్రేమికులను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. నగరంలో ప్లాంటేషన్ డ్రైవ్‌ను అత్యంత ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, ఎక్కడ పడితే అక్కడ కాకుండా ముందస్తు వ్యూహంతో 'పిన్ పాయింట్' పద్ధతిలో మాత్రమే మొక్కలను నాటాలని స్పష్టం చేశారు. మొక్కల కోసం గోతులను ఇష్టానుసారం తవ్వకుండా డిగ్గింగ్ యంత్రాన్ని వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా నగరంలోని విద్యాసంస్థలు, ప్రధాన వ్యాపార సముదాయాలు, హాస్పిటల్స్ పరిసరాలతో పాటు అన్ని ముఖ్యమైన ప్రధాన రహదారులను కవర్ చేస్తూ ఈ ప్లాంటేషన్ విస్తృతంగా జరగాలన్నారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటి మనుగడ కూడా అంతే ముఖ్యమని గుర్తు చేస్తూ, నాటిన ప్రతి మొక్క రక్షణకు తప్పనిసరిగా ట్రీ గార్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశువులు లేదా ఇతర కారణాల వల్ల మొక్కలు పాడవకుండా తగిన సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నగరాన్ని హరిత నగరంగా మార్చడంలో జూలై 31 గడువు అత్యంత కీలకమని, ఇంజినీరింగ్ మరియు పార్క్ విభాగాలు నిరంతరం సమన్వయంతో కృషి చేయాలన్నారు.

# పారదర్శకతే ప్రభుత్వ ధ్యేయం

రీ-సర్వే ప్రక్రియలో రైతులే భాగస్వాములు - ఆకస్మిక తనిఖీల్లో స్పష్టం చేసిన

రాష్ట్ర సర్వే డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్.



గుంటూరు జిల్లా ఫిరంగి పురం, జూలై 07 భూముల్లో నిర్వహిస్తున్న రీసర్వేల్లో రైతులను భాగస్వాములను చేసేలా ముందుగానే సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేయాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ అండ్ లాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. గుంటూరు జిల్లా ఫిరంగి పురం మండలం వేమవరం గ్రామం, అమరావతి మండలం దిడుగు గ్రామాలలో నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన జిల్లా రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల తో నేరుగా మాట్లాడి వాళ్ళకి చెందిన భూమిలో వాళ్ళ సమక్షంలో సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. రైతుల సమక్షంలో సర్వే జరగడం తో హర్షం వ్యక్తం చేశారు. గత రీసర్వేలలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పారదర్శకత ఉండేందుకు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సర్వే మొదలు పెట్టేరోజున తప్పనిసరిగా సంబంధిత రైతు లేదా కుటుంబసభ్యులు క్షేత్ర స్థాయిలో ఉండాలని, సర్వే పూర్తయిన తరువాత డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా సరిహద్దుల నిర్ణయం రైతు సమక్షంలోనే నిర్వహించాలన్నారు. రైతు చేతికి సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందజేసే వరకూ సమాచారం తప్పనిసరిగా అందించేలా చూడాలని అధికారులును ఆదేశించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుర్మనాధ్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీసర్వే 1. 0 లో భూ సరిహద్దుల నిర్ణయం, భూ వివరాలు తప్పులుగా నమోదవడంతో పాటు జాయింట్ ఎల్పీ నంబర్లు లాంటి చాలా ఇబ్బందులను రైతులు ఎదుర్కొన్నారన్నారు. గతంలో జరిగిన రీసర్వే లో తప్పులు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించే విధంగా రీసర్వే 2.0 నిర్వహిస్తున్నామన్నారు. రీసర్వే నిర్వహించిన తరువాత నోటీసు రూపంలో రైతు చూపించిన భూ హద్దుల ప్రకారం భూ వివరాలను తెలియజేయడం, డాక్యుమెంట్లతో సరిపోల్చుకుని నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కేవైసీ చేయించడం ద్వారా రైతు సమక్షంలో సర్వే నిర్వహించడంతో పాటు రైతులకు అన్ని విధాలా సమాచారం అందిస్తూ ఎక్కడా రైతులు ఇబ్బంది పడకుండా చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రీసర్వేల్లో ఫేజ్-1 లో 628, ఫేజ్-2 లో 748, ఫేజ్-3 లో 729, ఫేజ్-4 లో 1645 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 2,800 బృందలతో అత్యాధునిక రోవర్స్ తో సర్వే నిర్వహించడం జరుగుతున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో భూ వివరాలు, డాక్యుమెంట్ పరంగాగల వివరాలను రైతుల సమక్షంలోనే సరిపోల్చుతూ ఇకముందు ఎటు వంటి భూ వివాదాలకు తావులేకుండా రైతులు సంతృప్తి చెందే విధంగా రీసర్వే నిర్వహిస్తున్నామ న్నారు. ఫేజ్-5 లో రాష్ట్ర వ్యాప్తంగా 1, 343 గ్రామాలలో రైతులతో కలిసిమెలిసి క్షేత్రస్థాయిలో రీసర్వే నిర్వహిస్తున్నామన్నామని, రైతులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయిలో సమస్యలెదురైతే తక్షణ పరిష్కారం చేసే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ విధానాల పరంగా 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దేందుకు తమ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డివిజన్ సర్వే ఇన్స్పెక్టర్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు,సత్యన్నారాయణ, మండల సర్వేయర్ ఎ శ్రీనివాస్, రెవెన్యూ , సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు

## అధికారుల 'మొద్దు నిద్ర'

# బాపట్ల శాసనసభ్యుని సొంత గ్రామంలోనే కాలువ మరమ్మతులు చేయలేని నిస్సహాయ స్థితి

ఛిద్రమైన నల్లవాడ డైరెక్ట్ కాలువ షట్టర్: నీరు అందక పంట భూములు బీడువారుతున్న దుస్థితి - చందాలు వసూలు చేసుకుంటున్న రైతులు.

ఆక్రమణల కోరల్లో యాజలి కోడు కాలువ: 37 ఎకరాల కాలువ రెండు ఎకరాలకు కుంచించుకుపోయినా అధికారులకు 'తెలియదంట'!

ప్రజల సొమ్ము దోచుకుంటూ ఏసీ గదుల్లో కాలక్షేపం: క్షేత్రస్థాయిలో కనీస పర్యవేక్షణ లేని ఇరిగేషన్, డ్రైనేజీ అధికారుల తీరుపై మండిపడుతున్న అన్నదాతలు.

ఆక్రమణల మత్తులో యంత్రాంగం: రీ-సర్వే చేసినా కదలని అధికారుల తీరుపై కోర్టును ఆశ్రయిస్తున్న బాధితులు.



బాపట్ల, జూలై 07అధికార దర్పం, అధికారుల నిర్లక్ష్యం, కబ్జాదారుల అరాచకానికి బాపట్ల నియోజకవర్గం నిదర్శనంగా మారింది. ప్రజా ప్రతినిధుల సొంత గ్రామాలకే దిక్కు లేని పరిస్థితి ఉంటే, ఇక సామాన్యుడి గోడు వినేవారెవరు? అనే ప్రశ్న ఇప్పుడు బాపట్ల జిల్లా అంతటా వినిపిస్తోంది. నల్లవాడ డైరెక్ట్ కాలువ షట్టర్ ఛిద్రం కావడం కేవలం ఒక మచ్చుతునక మాత్రమేనని, దీని వెనుక భారీ కుంభకోణం, కబ్జా మాఫియా సామ్రాజ్యం ఏళ్ల తరబడి రాజ్యమేలుతోందని వెలుగులోకి వస్తున్న విషయాలు బాధితులను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. యాజలి గ్రామంలో 37 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 'కోడు కాలువ'ను గజం గజం ఆక్రమించి, దానిని రెండు ఎకరాలకు కుదించేశారంటే, డ్రైనేజీ శాఖ అధికారులు ఎంతటి ముడుపుల మత్తులో ఉన్నారో ఇట్టే అర్థమవుతోంది. దశాబ్దాలుగా ఉన్న ఈ కాలువ మ్యాపులను, రికార్డులను పక్కన పెట్టేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించడంలో అధికారులు చూపే వేగం, కాలువల పునరుద్ధరణలో ఎందుకు కనిపించడం లేదు? అని స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో చేపల వేటకు, ఊత సహాయంతో సాగుకు నీటిని అందించిన ఈ మార్గాన్ని, నేడు ఆక్రమణదారులకు దారాదత్తం చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీస్తున్నారు. ఈ అక్రమాలపై బాధితులు ఇప్పటికే పలుమార్లు కోర్టులను ఆశ్రయించారు. న్యాయస్థానాలు సైతం ప్రాథమిక విచారణలో అక్రమాలను గుర్తించినా, కిందిస్థాయి రెవెన్యూ, డ్రైనేజీ అధికారులు మాత్రం తమ 'మేనేజ్మెంట్' తో రిపోర్టులను మారుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రీ-సర్వే ప్రక్రియలోనైనా ఈ కబ్జాలు బయటపడతాయని రైతులు ఆశపడితే, ఆ అధికారులే కబ్జాదారుల పక్షాన నిలబడి అక్రమాలకు వత్తాసు పలకడం విడ్డూరం. ముంపు బారిన పడబోతున్న 3,000 ఎకరాల భూమి బాధ్యత ఎవరిది? పంట నష్టం జరిగితే పరిహారం మీ జేబుల నుండి ఇస్తారా? అని రైతులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. తన సొంత గ్రామంలోనే రైతులు చందాలు వేసుకుని షట్టర్లు మరమ్మతు చేసుకునే దుస్థితి ఉన్నా, స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తన సామాజిక వర్గానికి చెందిన స్మశానాల అభివృద్ధికి కోట్లు మంజూరు చేయించే నాయకుడు, రైతుల పొట్ట నింపే కాలువ పనులకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇది కేవలం అభివృద్ధి లోపం మాత్రమే కాదు, రైతు వ్యతిరేక ధోరణి అని వారు ఆరోపిస్తున్నారు. మేము కట్టే పన్నులు, నీటి తీరువా డబ్బులు మీరు ఏసీ గదుల్లో కూర్చోవడానికా?" అని అధికారులు ప్రశ్నిస్తున్న రైతులు, ఈ సమస్యపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు పంపాలని నిర్ణయించుకున్నారు. ఛిద్రమైన నల్లవాడ కాలువ షట్టర్‌ను యుద్ధ ప్రాతిపదికన వెంటనే ఏర్పాటు చేయాలి. యాజలి కోడు కాలువ ఆక్రమణలను 48 గంటల్లో గుర్తించి, తొలగించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలి. ఒకవేళ స్పందన లేకపోతే, బాపట్ల జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, ఆందోళన తీవ్రతకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని రైతులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. ఇకనైనా అధికారులు మొద్దు నిద్ర వీడతారా? లేక రైతుల ఉసురు తగులుతుందా? వేచి చూడాలి.

# ఉద్యోగుల సమస్యలకు 'ఫుల్‌స్టాప్'

# 21, 22 తేదీల్లో మెగా 'పెన్షన్ జీపీఎఫ్ అదాలత్'

జిల్లా కేంద్రంగా భారీ ఏర్పాట్లు!

జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ



గుంటూరు జిల్లా జూలై 07 ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ పొందిన తర్వాత, ఆర్థిక భద్రత కోసం ఎంతో ఆశగా ఎదురుచూసే పింఛనుదారులు, అలాగే సర్వీసులో ఉండి తమ పొదుపు నిధుల కోసం నిరీక్షించే ఉద్యోగుల కష్టాలకు తెర పడనుంది. ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా జూలై 21, 22 తేదీల్లో జిల్లాలో 'పెన్షన్ అండ్ జీపీఎఫ్ అదాలత్'ను నిర్వహించనుంది. ఈ అదాలత్ పరిధిలోకి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలు వస్తాయి. ఈ మూడు జిల్లాల్లోని వేలాది మంది ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ఒకే చోట పరిష్కరించేందుకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. గతంలో పెన్షన్ ఫైళ్లు అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి, ప్రభుత్వ కార్యాలయాలకు మధ్య తిరుగుతూ నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అటువంటి వాటన్నింటికీ ఈ అదాలత్ ఒక పరిష్కార మార్గంగా నిలవనుంది. జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ దీనిని అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమంగా భావిస్తున్నారు. "ప్రభుత్వ ఉద్యోగులు తమ జీవితకాలం ప్రజలకు సేవ చేసిన వారు. వారు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు పడకూడదు" అని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. డి.ఆర్.ఓ జిల్లా ఖజానా అధికారులకు నోడల్ బాధ్యతలు అప్పగించడంతో, అదాలత్ జరిగే రోజున ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగులు పెన్షనర్లు తమ వెంట సంబంధిత పత్రాలను తెచ్చుకోవడం ద్వారా నిర్ణీత సమయంలోనే పరిష్కారం పొందే అవకాశం ఉంది: జీపీఎఫ్ సమస్యలు ఉంటే: సంబంధిత జీపీఎఫ్ ఖాతా నంబర్, గతంలో జమ చేసిన వివరాలు, పెన్షన్ సమస్యలు ఉంటే: రిటైర్మెంట్ ఆర్డర్లు, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ నంబర్, బ్యాంక్ పాస్ బుక్ వివరాలు. ఆఫీసు రికార్డుల్లో అభ్యంతరాలు ఉంటే, డీడీఓ నుంచి తీసుకున్న క్లారిఫికేషన్ లెటర్లు. ప్రభుత్వం మరియు ఏ.జి. కార్యాలయం సంయుక్తంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని జిల్లాలోని ఉద్యోగ సంఘాలు స్వాగతిస్తున్నాయి. తమ సమస్యలను ఏ.జి. అధికారుల ముందు నేరుగా చెప్పుకునే అవకాశం కలగడం సంతోషకరమని, అదాలత్ విజయవంతం కావడానికి ఉద్యోగులందరూ సహకరించాలని సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. అదాలత్ నిర్వహించే ఖచ్చితమైన వేదిక, సమయం వివరాలను జిల్లా కలెక్టరేట్ నుండి మరో రెండు రోజుల్లో ప్రకటిస్తారు. పెన్షనర్లు అనవసరంగా ఇబ్బంది పడకుండా, వెబ్‌సైట్ పత్రికల ద్వారా వివరాలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.

# మేరా యువ భారత్' పోర్టల్‌లో నమోదుకు శ్రీకారం

యువశక్తిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్!




బాపట్ల జిల్లా జులై 07 మేరా యువ భారత్ పోర్టల్‌లో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వి సి హాల్ నందు జిల్లా యూత్ సంక్షేమ శాఖ (మై భారత్ కేంద్రం) అద్వర్యం లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మేరా యువ భారత్ పోర్టల్‌లో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో నమోదు చేసుకోనెల చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మేరా యువ భారత్ " పోర్టల్‌లో విద్యార్థులకు అవగాహన ప్రత్యేక కార్యక్రమాలు 2026 జూలై 1 నుండి ఆగస్టు 15 వరకు జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐలు, వృత్తి విద్యాసంస్థలు, ఎన్ఎస్ఎస్ ఎన్‌సీసీ, ఎన్‌వైకేఎస్ యువజన క్లబ్‌లు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని అధిక సంఖ్యలో విద్యార్థులను నమోదు చేయించాలన్నారు. "యువశక్తి -- దేశానికి శక్తి" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా యువతకు స్వచ్ఛంద సేవ, నాయకత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు, యువజన శిబిరాలు, వ్యాసరచన పోస్టర్, క్విజ్ పోటీలు, శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనే విద్యార్థుల కు ఈ-సర్టిఫికెట్లు పంపిణితో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఉదయం ప్రార్ధన సమావేశంలో ప్రతిరోజూ 10 నిమిషాలపాటు మై భారత్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, పోర్టల్ ప్రయోజనాలు, నమోదు విధానాన్ని విద్యార్థులకు వివరించాలని విద్య సంస్థల యజమాన్నికి చూచించారు.పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యార్థులు వెంటనే పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, మై భారత్ పోస్టర్లను పాఠశాలలు, కళాశాలల నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలన్నారు.పోస్టర్ డిజిటల్ కాపీని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ ఎన్సిసి ప్రోగ్రామ్ అధికారులు సమన్వయకర్తలు ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించి విద్యార్థులను నమోదు చేయాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో ఇద్దరు ఉపాధ్యాయులను నోడల్ అధికారులుగా నియమించి నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులు మరియు డిగ్రీ, పీజీ, ఐటీఐ, వృత్తి విద్య విద్యార్థులు.ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మై భారత్ పోర్టల్ ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు,స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం మరియు నాయకత్వ, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు యువజన శిబిరాలు, వర్క్‌షాప్‌లు వంటి కార్యక్రమాలలో పాల్గొని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవ్వడం జరుగుతుందన్నారు.జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా యూత్ సంక్షేమ శాఖ డి డి. కిరణ్మయి, డి యం అ హెచ్ ఓ.డాక్టర్ ఎస్.విజయమ్మ, డిఆర్డీఏ, మెప్మా పి డి లు,బి.సింగయ్య,ఆనంద సత్య పాల్,జి యం డి ఐ సి.రామ కృష్ణ, జిల్లా ఉపాధి నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారిణి మాధవి, జిల్లా క్రీడా సాధికారత అధికారి శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ డి డి రాజా దేబోరా, జిల్లా ఉపాధి కల్పన అధికారి జె.రాజారావు,యం సి సి .సుష్మా, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో జాప్యం వద్దు
## బాపట్ల అర్బన్‌లో పనితీరుపై
## జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అసహనం!



బాపట్ల జిల్లా జూలై 07 ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ జాబితా ప్రక్రియను అధికారులు చురుకుదనంతో పని చేసి పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహించే అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఈనెల 14వ తేదీతో పూర్తి అవుతుందని, ఇంకను 7 రోజులు మాత్రమే మిగిలి ఉందని ఆయన చెప్పారు. ఈ మొత్తం ప్రక్రియను నిర్ణీత గడువులోపు 100% పూర్తి చేయాలని ఆయన అన్నారు. బూత్ స్థాయి అధికారులు రోజుకు 85 ఎన్యుమరేషన్ ఫారంలను 2002 ఓటర్ జాబితా తో 2025 ఓటర్ జాబితాను మ్యాపింగ్ చేయాలని ఆయన చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు బి ఎల్ ఓల పనితీరుపై నివేదిక ఆధారంగా ఆయన సంబంధిత అధికారులను ఆరా తీశారు. జిల్లా మొత్తం మీద బాపట్ల అర్బన్ లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ తక్కువ చేయుటకు గల కారణాలపై ఆయన బాపట్ల మున్సిపల్ కమిషనర్ను ఆరా తీశారు. బాపట్లలో సరిగా పనిచేయని సూపర్వైజర్లపై చర్యలకు ఆయన ఆదేశించారు. బి ఎల్ వో లకు అదనపు సిబ్బందిని కేటాయించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయన బాపట్ల ఆర్డిఓ కు సూచించారు. బి ఎల్ వో లు ప్రతి రెండు గంటలకు పురోగతి సాధించాలని ఆయన చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే వాటిని అధికారులు దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకొని ముందుకు వెళ్లాలన్నారు. బుక్ ఎ కాల్ ఉన్న కాల్స్ ను 48 గంటల్లోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 48 గంటలు దాటకుండా చూసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అంగన్వాడీ వర్కర్లు, రిసోర్స్ పర్సన్స్, మెప్మా సిబ్బంది ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పాల్గొని పనులను వేగవంతం చేయాలని ఆయన చెప్పారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల లోపు ఈఆర్ఓలు, ఏ ఈ ఆర్ ఓ లు పనిచేసే చోట ఫోటోలు తీసి యాప్ లో అప్లోడ్ చేయాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ షేక్ షఫీ,వీక్షణ సమావేశం ద్వారా జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, మున్సిపల్ కమిషనర్లు, ఈ ఆర్ వో లు, ఏ ఈ ఆర్ వో లు, సూపర్వైజర్లు, బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన కాలువల ప్రక్షాళన, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం - కమిషనర్ కే. మయూర్ అశోక్!



గుంటూరు జులై 07 నగరంలో కురిసే వర్షాల వలన ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు కాలువలలోకి వెళ్ళేలా స్ట్రోం వాటర్ డ్రెయిన్ (వర్షపు నీరు) పారుదల వ్యవస్తను పటిష్టం చేస్తున్నామని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ అన్నారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్ నందు యస్.ఈ.జి.హెచ్ అసోసియేట్ బృంద ప్రతినిధులు నగరంలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్ ప్రాంతాలైన బ్రాడీపేట, కొబాల్డ్ పేటల్లోని పీకల వాగు, ఇన్నర్ రింగ్ రోడ్డు రిలయన్స్ వద్ద గల అంబేద్కర్ వాగు, బుడంపాడు, సంగడిగుంట ప్రాంతాలలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్స్ లో వర్షపు నీరు నిలబడకుండా తీసుకోవలసిన చర్యలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశం నందు తొలుత నగరంలో ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్ ప్రాంతాలైన బ్రాడీపేట, కొబాల్డ్ పేట పీకల వాగు, ఇన్నర్ రింగ్ రోడ్డు రిలయన్స్ వద్ద గల అంబేద్కర్ వాగు, బుడంపాడు, సంగడిగుంట ప్రాంతాలలో గల అవుట్ ఫాల్ డ్రెయిన్స్ పై యస్.ఈ.జి.హెచ్ అసోసియేట్ బృంద ప్రర్తినిధులు తయారు చేసిన పవర్ పాయింట్ ప్రేజేటేషణ్ ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో కొన్ని ప్రాంతాలలో చిన్నపాటి వర్షానికే వర్షపు నీరు రహదారుల్లో నిలబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సదరు సమస్యను అధిగామించదానికి వర్షాలు పడినప్పుడు నగరంలోని రహదారుల్లో వర్షపు నీరు నిలువకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలో యస్.ఈ.జి.హెచ్ అసోసియేట్ బృంద ప్రర్తినిధులు అధ్యయనం చేసి, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ తయారు చేశారని, సదరు పవర్ పాయింట్ ప్రేజేటేషణ్ మేరకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. నగరంలో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సదరు సమావేశంలో జియంసి ఇంచార్జ్ యస్.ఈ సుందరరామిరెడ్డి, యస్.ఈ.జి.హెచ్ అసోసియేట్ బృంద ప్రతినిధి శరత్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం
## యువత ఉద్యోగాలకు ఏపీ కేంద్రబిందువు

రూ.9 వేల కోట్లకుపైగా పెట్టుబడులకు ఆమోదం సంతోషకరం

ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్

ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రగతి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు జిల్లా జూలై 07 రాష్ట్రంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. ఏపీలో భారీగా పరిశ్రమల స్థాపనకు పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలపడంపై ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 9,076 కోట్ల రూపాయల పెట్టుబడులతో 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించడం ద్వారా 10,531 ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ లో యువతకు సువర్ణ అవకాశమని, మంచి స్కిల్స్ ఉన్న వారికి ఏపీని ఉద్యోగాలకు కేంద్రంగా మారుస్తున్నారని అన్నారు. మరో వైపు దక్షిణకొరియా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ దిగ్గజ సంస్థలతో భేటీ అయ్యారని తెలిపారు. హ్యూందాయ్ మోబిస్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, శాంసంగ్ వంటి కంపెనీతో చర్చలు నిర్వహిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చెప్పుల తయారీ వంటి కంపెనీలను సైతం రాష్ట్రం నుంచి తరిమికొట్టారని మండిపడ్డారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలంటేనే భయం కలిగేలా పాలన సాగించారన్నారు. దీంతో అనేక మంది యువత ఉద్యోగావకాశాలను కోల్పోయారని, వైసీపీది దుర్మార్గపు పాలన అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, క్వాంటమ్ వ్యాలీ, గూగుల్ వంటి పెద్ద పెద్ద సంస్థలు తరలివచ్చాయని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచించాలని సూచించారు. అప్పుడే ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

## మౌలిక వసతుల కల్పనే లక్ష్యం:
## జిల్లాలో రైల్వే, జాతీయ రహదారుల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం

భూసేకరణ అడ్డంకులకు చెక్:

శ్రీసిటీ ఫేజ్-2, వైజాగ్-చెన్నై కారిడార్ తదితర ప్రాజెక్టుల పెండింగ్ పనులపై

జిల్లా కలెక్టర్ డా,, ఎస్. వెంకటేశ్వర్ సమీక్ష




తిరుపతి, జూలై 07 రైల్వే ప్రాజెక్ట్,భూసేకరణ, జాతీయ రహదారులు పనులు శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి, రాయల్ ఎంఫిల్డ్ కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు తో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు,జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పి డి లు, రవీంద్ర రావు, రైల్వే ప్రాజెక్టు అధికారి, సదరన్ రైల్వే అధికారి వామన మూర్తి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, టి టి డి వెల్ఫేర్ అధికారి, ఎస్ఈ ఇరిగేషన్, ఆర్అండ్ బి ఎస్ఈ, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు,తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, 3 కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, శ్రీ సిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, రాయల్ ఎంఫిల్డ్ ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, విసిఐసి రోడ్డు, ఏపిఐఐసి ప్రాజెక్ట్స్,వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి - శ్రీకాళహస్తి, ఏర్పేడు - పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు- రేణిగుంట, పాకాల - తిరుపతి, తిరుపతి - కాట్పడి అర్కొణం - రేణిగుంట, సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను, దుగ్గరాజపట్నం, వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్ల రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. ఎయిర్పోర్ట్, ఇస్రేర్, కరకంబాడి, ఎమ్ ఐ జి లే అవుట్ తిమ్మాజికండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వడమాలపేట, ఏర్పేడు మండలాలలో పాదిరేడు అరణ్యం, పల్లం గ్రామాల నందు టీటీడీ ఉద్యోగస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కూడా త్వరిత గతిన చర్యలు తీసుకొని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి,సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, బానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి రాంప్రసాద్, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్,సంబంధిత తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు , సెక్షన్ ఆధికారులు భాస్కర్, చైతన్య, భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ-ఎయిమ్స్ యాప్ ద్వారానే పంపిణీ
## జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ!



గుంటూరు జిల్లా జూలై 07 యూరియా, డి.ఏ.పి ఎరువులను అధిక మోతాదులో వినియోగించవద్దని, సమతుల్యత పాటించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ కోరారు. యూరియా, డి.ఏ.పి ఎరువులను ఏపీ-ఎయిమ్స్ యాప్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. తుళ్లూరు మండలం పరిమి గ్రామంలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. 2026 - 27 సంవత్సరం నుండి యూరియా, డి ఏ పి ఎరువులను ఏపీ-ఎయిమ్స్ అను యాప్ ద్వారా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా యాప్ ను ప్రవేశ పెట్టడమే కాకుండా జూన్ 8వ తేదీ నుండి ఈ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తీసుకువచ్చిందని చెప్పారు. అపోహలు సరిదిద్దడానికి, పంట వేసే రైతుకు మాత్రమే ఎరువుల అందడానికి, బ్లాక్ మార్కెటింగ్, హోర్డింగ్ డైవర్షన్, అధిక ధరలకు విక్రయించే పాత వ్యవస్థను కట్టడి చేయడం ఈ నూతన వ్యవస్థ ద్వారా వీలుకలుగుతుందన్నారు. ఈ నూతన విధానంలో యూరియా, డి.ఏ.పి ఎరువులు పంట వేసిన రైతులకు మాత్రమే అందాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఇందుకు రైతు సేవా కేంద్రాలను రెవిన్యూ గ్రామంతో అనుసంధానం చేయడం జరిగిందని, రెవిన్యూ గ్రామంలో ఉన్న రైతుల అందరి వివరాలు, 2025 ఖరీఫ్ కాలంలో వారు సాగు చేసిన పంటల వివరాలు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సరిపోల్చు నిమిత్తం ఏపీ - ఎయిమ్స్ యాప్ లో అందుబాటులోకి తేవడం జరిగిందని వివరించారు. ఈ విధానంలో జిల్లాలోని రైతులకు ఇప్పటికీ ఖరీఫ్ పంటకాలానికి సాగు చేసే పంటకు కావలసిన ఎరువులు వారు సాగుచేసిన పంట, విస్తీర్ణాన్ని ఆధారంగా వ్యవసాయ శాస్త్రవేత్తల ఎరువుల సిఫార్సుల అనుగుణంగా కొనుగోలు చేయవచ్చన్నారు. పంట కాలం మొత్తానికి కావలసిన ఎరువులు మూడు దఫాలుగా పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు. వివరాలు సరిచూసుకోండి రైతులు ఎరువులు కొనుగోలు నిమిత్తం పంట భూమి వివరాలు, సాగు చేసే పంటల వివరాలు ఆయా రైతు సేవా కేంద్రాలలో సర్వే నెంబరు, ఖాతా నెంబరు, విస్తీర్ణం, పంట సరిగా ఉన్నట్లు రైతు సేవ కేంద్రం సహాయకుల ద్వారా సరిచూసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాలలో వివరాలు తప్పుగా ఉంటే మార్పించుకొనుటకు అవకాశం ఉందని చెప్పారు. వివరాలు సరిచేసుకోకుండా యాప్ ద్వారా కొనుగోలు చేసిన తర్వాత వివరాల మార్పు సాధ్యం కాదని స్పష్టం చేశారు. సందేహాలకు, వివరాలకు స్థానిక రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు పొందవచ్చని, స్థానికంగా ఏర్పడే సమస్యలను రాష్ట్ర వ్యవసాయ శాఖ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 155251కు గాని లేదా స్థానిక వ్యవసాయ అధికారిని గాని సంప్రదించవచ్చని తెలిపారు. అనవసరమైన, అవాస్తవమైన ప్రచారాలు నమ్మవద్దు అనవసరమైన, అవాస్తవమైన ప్రచారాలు నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. సకాలంలో ఎరువులు సక్రమంగా పంపిణీ చేయడానికి రైతులు జిల్లా యంత్రాంగానికి సహకారం అందించాలని కోరారు. స్థానిక వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వడం ద్వారా త్వరితగతిన ఎరువులు పొందవచ్చని అన్నారు. భూ సేకరణకు సహకరించాలి రాజధాని భూముల కొరకు ప్రభుత్వం సేకరణ చేపడుతుందని, అందుకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ప్రభుత్వం న్యాయపరమైన నష్టపరిహారాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.విపద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహా రెడ్డి,ఎ.పిఎం.ఐ.పి ఎల్. వజ్రశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను 25 శాతం తగ్గిస్తాం - గంజాయి, మహిళా భద్రతపై

జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఉక్కుపాదం!

రాబోయే ఆరు నెలల లక్ష్యంగా 'రోడ్డు భద్రత'పై ప్రత్యేక కార్యాచరణ: జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలు.

బహిరంగ మద్యం సేవించేవారిపై కఠిన చర్యలు: మత్తులో వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని స్పష్టీకరణ.


గంజాయి రహిత బాపట్ల జిల్లాగా మార్చడమే లక్ష్యం: రవాణా, విక్రయాల కట్టడికి నిఘా పెంపు.

మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యత: విద్యాసంస్థల వద్ద 'శక్తి' బృందాల నిరంతర నిఘా, ఆకతాయిలపై ఎస్ ఓ ఎస్ షీట్స్.

సాంకేతికతతో పెండింగ్ కేసుల పరిష్కారం: దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశం.




బాపట్ల జిల్లా జులై 07 బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, హెచ్చరించారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులతో ఎస్పీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి పోలీస్ స్టేషన్, సర్కిల్, సబ్-డివిజన్ల పరిధిలో నమోదైన వివిధ నేరాలు, వాటి ప్రస్తుత దర్యాప్తు స్థితిగతులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో



పురోగతిపై ఆరా తీస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ కేసులను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ప్రమాదాలు జరగకుండా ముందే నివారణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమన్నారు. జిల్లాలో నుంచి 3 ప్రధాన జాతీయ రహదారులు వెళుతున్నాయన్నారు. అంతే కాకుండా ఇటీవల కాలంలో జిల్లాకు వచ్చే యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను, రోడ్డు ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి, ఆ ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా జంక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించడానికి రాంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో సైతం రోడ్లు స్పష్టంగా కనిపించేలా తగిన లైటింగ్ వ్యవస్థ, సైన్ బోర్డులు, ఇండికేటర్లను అమర్చాలన్నారు. ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. రాబోయే 6 నెలల కాలంలో రోడ్డు ప్రమాదాలను కనీసం 25 శాతం తగ్గించే విధంగా ఒక నిర్దేశిత లక్ష్యంతో పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. రోడ్డు భద్రత అనేది ఏదో ఒక రోజు వాహనదారులను చైతన్యం చేయడం కాదని, అది ప్రతినిత్యం జరగాల్సిన ప్రక్రియని పేర్కొన్నారు. రవాణా శాఖ అధికారులతో పూర్తి సమన్వయం చేసుకొని 'జాయింట్ యాక్షన్ ప్లాన్' అమలు చేయాలన్నారు. శిరోరక్ష ప్రాణరక్ష కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధారణ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వ్యవసాయ పనులకు, ఇతర కూలి పనులకు వెళ్లేవారు ఆటోలు, ట్రాక్టర్లు వంటి వాహనాలలో పరిమితికి మించి ప్రయాణించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఓవర్‌లోడింగ్ వాహనాలు ఏదైనా అనుకోని ప్రమాదానికి గురైతే ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని, కావున అటువంటి వాహనాలపై కఠినంగా వ్యవహరించడంతో పాటు ప్రజలకు, వాహన యజమానులకు తగిన అవగాహన కల్పించాలని ఆదేశించారు. రహదారుల పక్కన అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపి ఉంచడం, సరైన సిగ్నల్స్ వేయకుండా మలుపులు తిరగడం వంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా రహదారుల పక్కన బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు ముప్పు తెచ్చేవారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రమాదాల రేటును తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడేలా ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలన్నారు. మహిళా సంబంధిత చట్టాల గురించి శక్తి బృందాలు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా నిర్మానుష్య ప్రదేశాలు, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలలో విస్తృతంగా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. పాఠశాలలు కళాశాలలకు విద్యార్థినిలు వెళ్లే సమయాలలో, వచ్చే సమయాలలో శక్తి బృందాలు ఆ ప్రదేశాలలో నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు మహిళల పట్ల, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరించి వారిపై సూూ షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్ధాలకు యువత బానిసలు కాకుండా వారిలో చైతన్యం తీసుకు వచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గతంలో గంజాయి సంబంధిత కేసులలో పట్టుబడిన వారిపై నిఘా ఉంచాలన్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాల పై ఉక్కుపాదం మోపాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాత్రి వేళలో గస్తీ ముమ్మరం చేసి ప్రాపర్టీ నేరాలను కట్టడి చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో దొంగలించబడిన సొమ్మును వేగవంతంగా రికవరీ చేసి బాధితులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె, బాపట్ల, చీరాల, సీసీఎస్, ఏ.ఆర్, డీఎస్పీలు షేక్ అబ్దుల్ అజీజ్, సీహెచ్. చంద్రమౌళి, ఎండీ. మొయిన్, పి. జగదీష్ నాయక్, పి.కృష్ణంరాజులు, జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి, జిల్లాలోని సిఐలు, ఎస్ఐ లు, డిపిఓ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు 32వ డివిజన్ జహీర్ పుర లో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలు



ఖమ్మం :లోకల్ గైడ్ :ఖమ్మం : 32వ డివిజన్ గుట్టల బజార్ జహీర్ పుర ప్రాంతంలో మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా గౌరవ పెద్దలు జిల్లా పెల్లి మనోహర్ జెండాను ఆవిష్కరించడం జరిగింది . పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న జయంతి ఉత్సవాలలో భాగంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఖమ్మం నగర అధ్యక్షులు బాకీ శ్రీను మాదిగ , ఖమ్మం టౌన్ నాయకులు దేవరకొండ రామ్ మాదిగ , ఎంఎస్పి నగర నాయకులు సూరపల్లి నాగేశ్వరరావు మాదిగ , డివిజన్ అధ్యక్షులు సూరపల్లి వెంకట్ రత్నం మాదిగ , ఎమ్మార్పీఎస్ టౌన్ నాయకులో తమ్మర్ల వెంకట కరుణ మాదిగ , మాజీ కార్పొరేటర్ దొన్వాన్ రవి , మెట్టు సాల్మన్ మాదిగ , తోళ్ల ఉమామహేశ్వరరావు మాదిగ , చెరుకుపల్లి ఉపేందర్ మాదిగ , తోళ్ల కుటుంబరావు మాదిగ , గుడిపాటి వెంకన్న మాదిగ , తోళ్ల రాకేష్ మాదిగ , నామవరపు ఈశ్వర్ మాదిగ , సూర పెల్లి ఉపేందర్ మాదిగ , సూరపల్లి అశోక్ మాదిగ , కలకోట వాసు మాదిగ , దేవరకొండ సాయి మాదిగ , తోళ్ల శివ మాదిగ , మారపొంగు కృష్ణ మాదిగ , గాజుల వేణు మాదిగ , దేవరకొండ నాగేశ్వరరావు మాదిగ , తేజావత్ రవి , గురుమూర్తి , కృష్ణ , రమేష్ తదితరులు పాల్గొన్నారు .

## పండగ వాతావరణం లో " సర్ " కార్యక్రమం నిర్వహించాలి .

నిర్లక్ష్యం చేసే వారిపై క్రమశిక్షణ చర్యలు ..

ఎమ్మెల్యే తూడి మేఘారట?డ్డి .. కాంగ్రెస్ అధిష్టానం సర్ పై ప్రత్యేక దృష్టి .

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేనా రెడ్డి.




వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి జులై 7:గ్రామాల్లో పండగ వాతావరణంలో సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి లు పిలుపునిచ్చారు.మంగళవారం వనపర్తి సెగ్మెంట్ లోని వివిధ మండలాలకు చెందిన బీ ఎల్ ఏ -- 2 లకు నిర్వహిం చిన అవగాహన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిచారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఎన్నికల పరంగా అత్యంత కీలకమైనదని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త దీనిని అత్యంత బాధ్యతగా తీసుకోవాలని వారు సూచించారు. గ్రామాల్లో ఈ కార్యక్రమం ఒక పండుగలా చేయాలన్నారు . సమగ్ర ఓటరు జాబితా సవరణకు ఇంకా కేవలం 20 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందన్నారు . నాయకులు, కార్యకర్త లు గడపగడపకు వెళ్లి అర్హుడి వద్ద సర్ దరఖాస్తులు నమోదు చేయించాలని వారు సూచించారు.ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అందరు ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు.ఒక్క అర్హుడి ఓటు కూడా జాబితాలో చేరకుండా, మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు . అదేవిధంగా గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని వారు కోరారు. ప్రభుత్వం మనదే కదా అనే ఓవర్ కాన్ఫిడెన్స్ తో నిర్లక్ష్యం చేయకూడదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు స్పష్టం చేశారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, సీరియస్‌గా నిర్వహిస్తోందని, ఇందులో నిర్లక్ష్యం వహించే వారికి పార్టీపరంగా క్రమశిక్షణ చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.ప్రతిపక్ష పార్టీల వారు దొంగ ఓట్లను నమోదు చేయించేందుకు ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయని, అలాంటి ప్రతి ప్రయత్నాన్ని అప్రమత్తంగా అడ్డుకోవాలని వారు సూచించారు. వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో బీ ఎల్ ఏ లు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధానికి పోస్ట్ కార్డులు.

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .లోకల్ గైడ్ . ఈ పార్లమెంటు సమావేశాల్లోనే మహిళా బిల్లు ఆమోదించి మహిళా రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కి మహిళలు పోస్టుకార్డులు పంపారు. మంగళవారం కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ప్రధానమంత్రి మోడీకి మిస్డ్ కాల్స్ చేశారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మయూరి సింగ్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి,లు మాట్లాడుతూ మహిళా బిల్లును వెంటనే ఆమోదించి రిజర్వేషన్ అమలు చేసి చట్టబద్ధత కల్పించాలన్నారు. అలాగే జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకపోయి పార్టీని పటిష్ట పరచాలన్నారు,రైతు భరోసా పై రైతులకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలు పట్టణాలు మున్సిపాలిటీలకు చెందిన మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు సుజాత,స్వరాజ్యలక్ష్మి, భాగ్య, జానకి,సౌజన్య, సరస్వతీ,పద్మ,సోమమ్మ, లలిత,రాధా,నారాయణమ్మ, స్వప్న,లలిత, పల్లవి, వెంకటమ్మ,స్వరూప,రేఖ, సాత్విక,అశ్విని,స్వప్న, అంజమ్మ, లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

పీహెచ్సీలు, యూపీహెచ్సీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



లోకల్ గైడ్ / సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.జిల్లాలోని 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పీహెచ్సీ, యూపీహెచ్సీ వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అన్నారు. ఆసుపత్రుల్లో తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ వైరింగ్, లైటింగ్, ఫ్యాన్లు, ఇతర చిన్నచిన్న మరమ్మత్తులు చేపట్టేందుకు అవసరమైన అంచనా ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి పీహెచ్సీని అన్ని విధాలుగా బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, లక్ష్య సాధనలో వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, ప్రజల్లో అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికి వ్యాక్సినేషన్ అందేలా కృషి చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, డాక్టర్ శశాంక్, పీహెచ్సీ, యూపీహెచ్సీ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...



ప్రభుత్వ పాఠశాలలు,సంక్షేమ వసతి గృహాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని వేమనపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని,భోజనశాల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని తెలిపారు.తరగతి గదులు,వసతి గదులు,వంటశాల,పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం,శుద్ధమైన త్రాగునీరు అందించాలని,వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని,ఆ దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించడం జరిగిందని,విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మండలంలోని గొలపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు.బూత్ స్థాయి అధికారుల ద్వారా ప్రజలకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించారు.ఫారాలు పూరించిన తర్వాత బూత్ స్థాయి అధికారులు సేకరించి వాటిలోని సమాచారాన్ని బిఎల్ఓ యాప్ లో డిజిటలైజ్ చేయనున్నట్లు తెలిపారు.ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలను సరైన సమాచారంతో నింపడంలో బూత్ స్థాయి ఏజెంట్లు,వాలంటీర్లు ప్రజలకు సహకరించి,స్పష్టమైన సమాచారాన్ని పొందుపరిచేలా కృషి చేయాలని తెలిపారు.ఈ నెల 24వరకు గడువు ఉన్నందున ఓటరు వివరాలను నింపిన ఎన్యుమరేషన్ ఫారాలను అందించని పక్షంలో ఓటు కోల్పోయే అవకాశం ఉందని,బూత్ స్థాయి ఏజెంట్లు,వాలంటీర్లు,యువత ఫారం పూరింపులో ప్రజలకు సహకరించాలని తెలిపారు.సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 2002సంవత్సరంలో ఓటు హక్కు కలిగిన వారి కుటుంబ సభ్యులను అనుసంధానం చేస్తు ప్రస్తుత సవరణ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.డబుల్,షిఫ్టెడ్,డెత్ ఓటర్ల తొలగింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు,భూ భారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల పెండెన్సీ పరిశీలించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయి పరిశీలన చేసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం చెన్నూరు పట్టణంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సాయికృష్ణ,మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమారస్వామి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి .. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి

వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలి

ఇంటర్మీడియట్ కళాశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఇంటర్మీడియేట్ విద్య, మౌళిక వసతుల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, జూలై -- 07:లోకల్ గైడ్ :జిల్లాలోని ప్రతి ఇంటర్మీడియట్ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ పనితీరు, విద్యా ఫలితాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరపు ఫలితాల విశ్లేషణ, వచ్చే విద్యా సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న సివిల్ పనుల పురోగతి, ప్రైవేట్ జూనియర్ కళాశాలల అనుమతు లపై సమీక్షించగా, మెరుగుదల పరీక్షల అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కు సంబంధిత అధికారులు వివరించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించని విద్యార్థులపై సమగ్ర విశ్లేషణ చేపట్టి, కారణాలను గుర్తించాలని, ముఖ్యంగా ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉంటున్నారో గుర్తించి ఆ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో అధ్యాపకుల కొరత లేదని, అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించి వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ను తప్పనిసరిగా అమలు చేయాలని, తరచూ గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కాకపోతే మంచి ఫలితాలు ఆశించలేమని అన్నారు.నవంబర్ నాటికి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రతి విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నాడో విశ్లేషించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. సిలబస్, పరీక్షా విధానంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని బోధన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులపై జూనియర్ లెక్చరర్లు ప్రత్యేక దృష్టి సారించి శ్రద్ధతో ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి పనులకు రూ. 2.96 కోట్లు మంజూరయ్యాయని, అందులో రూ. 2.26 కోట్లు కళాశాలల ఖాతాలకు విడుదల కాగా ఇప్పటివరకు రూ.1.59 కోట్లు వినియోగించినట్లు తెలిపారు. పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్ రికార్డులు, వినియోగ ధృవీకరణ పత్రాలు సకాలంలో సమర్పిస్తే మిగిలిన నిధులు విడుదలవుతాయని చెప్పారు.నిర్మాణ పనులను సామర్థ్యం కలిగిన కాంట్రాక్టర్లకే అప్పగించాలని, అనవసర జాప్యాలకు అవకాశం ఇవ్వవద్దని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన కళాశాలల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని,పనులు ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.అనుబంధ గుర్తింపు, అవసరమైన అనుమతులు లేకుండా ఏ ప్రైవేట్ జూనియర్ కళాశాల కూడా నిర్వహించ రాదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరూ ఆటలాడేందుకు అవకాశం ఇవ్వబోమన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, లోపాలను సరిదిద్దుకునేందుకు ఒక నెల గడువు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి కళాశాలలో శాశ్వత ప్రయోగశాలలు, అవసరమైన మౌళిక సదుపాయాలు తప్పని సరిగా ఉండాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవిబాబు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములకు సర్వే చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి

# జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 7: ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తహసీల్దార్లను ఆదేశించారు.మంగళవారం కొండపాక మండలం విశ్వనాథ్‌పల్లి గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలోని ప్రభుత్వ స్థలం, చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామంలోని డంపింగ్ యార్డ్ పరిసరాలు, కొమురవెల్లి మండలంలో రాజీవ్ రహదారి సమీపంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూములను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ భూమి ఎంత ఉంది, ఎంత మేర ఆక్రమణకు గురైందనే పూర్తి వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ భూములకు పకడ్బందీగా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టవిరుద్ధమని, అక్రమ కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా వ్యవహరించాలని తహసీల్దార్లకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం భూముల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.**

## ఎఫ్ సిఐని అదానీ గ్రూప్ కు కట్టబెట్టడాన్ని తక్షణమే నిలిపివేయాలి-




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్. భారత ఆహార సంస్థ (ఎఫ్ సిఐ)కి చెందిన సైలో పథకాన్ని అదానీ గ్రూప్‌నకు కట్టబెట్టడాన్ని తక్షణమే నిలిపివేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం తెలంగాణ అల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఎఫ్సీఐ హమాలి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నలగొండ విస్తృత సమావేశం సుందరయ్య భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దేశ ఆహార భద్రతా మౌలిక సదుపాయాలను కార్పొరేటీకరించడానికి జరుగుతున్న ప్రమాదకరమైన ప్రయత్నాన్ని ఇది బట్టబయలు చేసిందని అన్నారు.మొత్తం 134 సైలో కాంట్రాక్టుల్లో 110 కాంట్రాక్టులను అదానీ అగ్రీ లాజిస్టిక్స్ లిమిటెడ్, లీప్ ఇండియా ఫుడ్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు రూ.16,500 కోట్లకు దక్కించుకున్నాయని వారు అన్నారు. దీంతో దేశ తిండిగింజల భద్రతా నెట్‌వర్క్‌లో మెజారిటీ వాటా ఈ రెండు సంస్థల చేతుల్లోకి వెళ్లనుందని, ఈ పథకం కింద నిల్వ చేయాల్సిన మొత్తం 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో, సుమారు 46.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఈ రెండు సంస్థల ఆధీనంలోనే ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎఫ్ సిఐ స్వయంగా ప్రతిపాదించిన గుత్తాధిపత్య వ్యతిరేక నిబంధనను ఉల్లంఘిస్తూ ఈ పరిణామం చోటుచేసుకుందని విమర్శించ్చారు.?ఈ ప్రాజెక్టులో భాగంగా అదానీ గ్రూప్ ధాన్యాగారాలను (సైలోలను) పంపిణీ కేంద్రాలకు అనుసంధానించేందుకు ఒక భారీ ప్రైవేట్ రైల్వే నెట్‌వర్క్‌ను నిర్మిస్తోందని, దీని ద్వారా ధాన్యం సేకరణ, నిల్వ, రవాణా నుండి ఎగుమతి వరకు సరఫరా గొలుసులోని అన్ని దశలు పూర్తిగా అదానీ గ్రూప్ నియంత్రణలోకి వెళతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరించే ఉద్దేశంతో నీతి ఆయోగ్, ఆర్థిక వ్యవహారాల శాఖ జోక్యం చేసుకుని టెండర్ విధానంలో సమూల మార్పులు చేశాయని, అందులో భాగంగానే ఎఫ్ సిఐ ప్రతిపాదించిన గుత్తాధిపత్య నిరోధక నిబంధనను కూడా తొలగించారని వెల్లడించింది. రైతుల పోరాటాల వల్ల మూడు వ్యవసాయ చట్టాలు రద్దయినప్పటికీ, ఇప్పుడు దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించేందుకు 'దొడ్డి దారి'లో ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) చట్టపరమైన హామీ ఇస్తామంటూ రైతులకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి నిరాకరిస్తున్న మోడీ ప్రభుత్వం, మరోవైపు వ్యూహాత్మకంగా ప్రజా పంపిణీ వ్యవస్థను, ఎఫ్ సిఐని బలహీనపరుస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పెట్టుబడులతో ఎఫ్ సి ఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలే తప్ప, వాటిని కార్పోరేట్ సంస్థలకు అప్పగించకూడదని వారు డిమాండ్ చేశారు.కార్పోరేట్ సంస్థల నియంత్రణకు దోహదపడటంలో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ, ప్రభుత్వ మంత్రిత్వ శాఖల పాత్రపై సమగ్ర విచారణ జరిపేందుకు ఒక సంయుక్త పార్లమెంటరీ కమిటీని (జెపిసి)ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఎఫ్ సిఐని కార్పొరేట్లు స్వాధీనం చేసుకోవడాన్ని నిరోధించేందుకు కార్మిక వర్గం ఏకమై తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ ఎఫ్సీఐ హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సుంకరబోయిన వెంకన్న, కార్యదర్శి పాలకూరి సైదులు, సభ్యులు నరముల రమేష్, రాములు, వెంకన్న, గణేష్, మేకల రవి, శ్రీనివాస్, ప్రభాకర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేటలో పారిశుద్ధ్యం, ఫుట్‌పాత్‌లను పరిశీలించిన ఎంఎంసీ కమిషనర్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, లోకల్ గైడ్, జూలై 7:-బేగంపేట ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఫుట్‌పాత్‌ల పరిస్థితిని ఎంఎంసీ కమిషనర్ అదనపు కమిషనర్ (శానిటేషన్), డీసీ, డీఈ, ఏఈలు, రామ్‌కీ సంస్థ ప్రతినిధులతో కలిసి సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రహదారులు, ఫుట్‌పాత్‌లపై పేరుకుపోయే చెత్తను ప్రతిరోజూ పూర్తిస్థాయిలో తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో యాంత్రిక శుభ్రత పరికరాల వినియోగాన్ని మరింత పెంచి వేగవంతంగా పనులు చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా సమావేశాలు, కార్యక్రమాలు ముగిసిన వెంటనే ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించి ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా, ఆటంకాలు లేకుండా ఉంచాలని అధికారులకు సూచించారు.పరిశుభ్రమైన వీధులు సమర్థవంతమైన పాలనతో పాటు పౌరుల సామాజిక బాధ్యతకు ప్రతీక అని కమిషనర్ పేర్కొన్నారు.

## ఈనెల 10న. చింతకాని లో రైతు ఆశీర్వాద సభ..



లోకల్ గైడ్. చింతకాని. మధ్యాహ్నం రెండు గంటలకు రైతు ఆశీర్వాద సభ. సాయంత్రం చింతకాని మండలం జగన్నాధపురం వద్ద రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి తుమ్మల.ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు మధిర. నియోజకవర్గ పరిధిలోని. చింతకాని మండలంలోని జగన్నాధపురం గ్రామంలో. రైతు ఆశీర్వాద సభ జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గారు తెలిపారు. ఈరోజు సాయంత్రం జిల్లా అధికారులు మరియు రాష్ట్ర. జిల్లా కాంగ్రెస్ నాయకులు. మధిర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. గత నెల 30వ తేదీన జరగవలసిన ఈ ఆశీర్వాద సభ. వర్షం కారణంగా రద్దు అయినది. తిరిగి ఈనెల 10వ తేదీన ఈ రైతు ఆశీర్వాద సభ జరుగుతుందని. ఈ సభకు వచ్చే రైతులకు ఇబ్బంది కలగకుండా చేయవలసిన ఏర్పాట్లు. పార్టింగు ఇతర అంశాలపై రాష్ట్ర మంత్రి తుమ్మల జిల్లా ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు సూచనలు ఇచ్చారు. వ్యవసాయాన్ని రాష్ట్రంలో పండుగ లాగా చేయాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం అని గత పాలకులు ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించిన. అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా అందించాలనేదే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన అని మంత్రి తుమ్మల తెలిపారు. 9 రోజుల్లో తొమ్మిది వేల కోట్లను రైతు ఖాతాలో జమ చేస్తామని దీంట్లో భాగంగా ఈరోజు వరకు.7.750.45కోట్ల రూపాయలను రైతు భరోసా పథకం కింద రైతు ఖాతాలో జమ చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. జగన్నాధపురం లో రైతు ఆశీర్వాద సభ ఏర్పాటును. పరిశీలించిన అనంతరం మంత్రి తుమ్మల మీడియా సమావేశంలో మాట్లాడినారు

## సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన సర్పంచ్



నారాయణపేట జూలై 7లోకల్ గైడ్. : మాగనూర్ మండలం వడ్వాట్ గ్రామపంచాయతీ కి చెందిన పేద కతలప్పకు మంత్రి డాక్టర్ శ్రీహరిఈ ఆదేశానుసారం సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సర్పంచ్ జి రవీందర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి వాకిటి శ్రీహరి



నారాయణపేట జూలై 7:లోకల్ గైడ్. :మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని దండు గ్రామ గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా మంగళవారం రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మంత్రి వాకిటి శ్రీహరి ని శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్లు పూరించిన పత్రాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక.



నారాయణపేట జూలై 7:లోకల్ గైడ్. :ఓటర్ల నుంచి పూరించిన ఎన్యూమరేషన్ పత్రాలను సేకరించి వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక బీ ఎల్ వో లను ఆదేశించారు. బీ ఎల్ వో లు ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్ళి ఎన్యూమరేషన్ పత్రాలను సేకరించాలని, పత్రాలు నింపడం తెలియని ఓటర్లకు దగ్గరుండి సహకారం అందించాలని సూచించారు. మంగళ వారం నారాయణపేట మండలంలోని చిన్న జట్రశీ, కొల్లంపల్లి, లింగంపల్లి గ్రామాలలో కలెక్టర్ పర్యటించి బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్ల పనితీరు, జిల్లాలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. చిన్నజట్రశీ గ్రామానికి సంబంధించి పోలింగ్ స్టేషన్ నం. 176,177, కొల్లంపల్లి గ్రామానికి సంబంధించి పోలింగ్ స్టేషన్ 182 నుంచి 186, అలాగే లింగం పల్లి గ్రామానికి సంబంధించిన 187 పోలింగ్ స్టేషన్ ల వారీగా ఇంతవరకు ఎన్ని ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు ? అందులో ఎన్ని పత్రాలను తిరిగి తీసుకున్నారు ? ఇంకా ఎన్ని తీసుకోవాల్సి ఉందనే వివరాలను ఆయా బీ ఎల్ వో లను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి బీ ఎల్ వో లకు తిరిగి ఇస్తేనే ఓటరు జాబితాలో పేరు ఉంటుందని, ఇవ్వక పోతే జాబితాలో పేరు ఉండదు అని ఆమె స్పష్టం చేశారు. చనిపోయిన ఓటర్ల పేర్లు, డబుల్ ఓట్లు తొలగించాలన్నారు.జిల్లాలోని బీఎల్ వోలు ఇక నుంచి రోజుకు భర్తీ చేసిన వంద ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి తీసుకుని, ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, సూపర్ వైజర్లు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం...



లోకల్ గైడ్. ఖమ్మంరోడ్డు సేఫ్టీ అవగాహన కేంద్రాన్ని ప్రారంభించిన డీజీపీ సివి.ఆనంద్..వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు హెల్మెంట్ల పంపిణీ.కమ్యూనిటీ పోలిసింగ్ సీసీ కెమెరాలను వర్చువల్ గా ప్రారంభం...ప్రజలలో, విద్యార్థులు, వాహనదారులలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 'రోడ్డు సేఫ్టీ అవగాహన కేంద్రాన్ని' తెలంగాణ రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ ప్రారంభించారు. వీటి ద్వారా ప్రాక్టికల్ డెమోలు, సైన్ బోర్డుల గుర్తింపు తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరిస్తూ. పలువురు వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా నేలకొండపల్లి మండల ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న 253 సిసి కెమెరాలను పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి వర్చువల్ గా డీజీపీ ప్రారభించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో సహకరించిన ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా గృహ నిర్మాణ శాఖ నూతన పీడీగా భగవంతు రావు బాధ్యతల స్వీకారం


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ హైమావతి సూచన



లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 7: సిద్దిపేట జిల్లా గృహ నిర్మాణ శాఖ నూతన ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ)గా సిహెచ్. భగవంతు రావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతిని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.ఆదిలాబాద్ జిల్లాలో గృహ నిర్మాణ శాఖ డీఈగా విధులు నిర్వహించిన భగవంతు రావు బదిలీపై సిద్దిపేటకు వచ్చారు. ఇంతకుముందు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో భగవంతు రావు బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వేగంగా గృహ నిర్మాణం పూర్తి చేసుకునేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిలో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని నూతన గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు ఆదేశించారు.

## ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు 3.86 లక్షల విలువైన సరుకు నిలిపివేత!

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు వ్యవసాయ శాఖ అధికారుల హెచ్చరిక



భూపాలపల్లి :(లోకల్ గైడ్ ప్రతినిధి)జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిధిలోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకున్నారు.మండల పరిధిలోని సూరారం, రాపల్లికోట గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏ డి ఏ) శ్రీ పాల్, మండల వ్యవసాయ అధికారిణి (ఎమ్ ఏ ఓ) శ్రీజ తమ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సాయి ఫర్టిలైజర్స్ సూరారం దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులను సరిగ్గా నిర్వహించకపోవడం, రైతులకు రశీదులు ఇవ్వకపోవడంతో అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ఉల్లంఘన కింద రూ. 2,39,000 విలువైన సరుకుకు 'స్టాప్ సేల్' (అమ్మకాల నిలిపివేత) ఉత్తర్వులు జారీ చేశారు.డీసీఎంస్ దుకాణం (రాపల్లికోట) ఈ షాపులో కూడా నిబంధనలు పాటించనందున సుమారు రూ. 1,47,000 విలువైన సరుకు క్రయవిక్రయాలను నిలిపివేస్తూ అధికారులు ఆదేశాలు ఇచ్చారు.నిబంధనలు ఉల్లంఘించిన ఈ రెండు దుకాణాల నిర్వాహకులకు సంజాయిషీ కోరుతూ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరపకూడదని స్పష్టం చేశారు.వినాయక ఫర్టిలైజర్ (సూరారం) ఈ దుకాణాన్ని కూడా తనిఖీ చేసిన అధికారులు, గడువు ముగిసిన దుకాణ లైసెన్స్‌ను తక్షణమే రెన్యూవల్ చేసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు.ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ పాల్ మాట్లాడుతూ.. ఎరువులను అధిక ధరలకు అమ్మినా, నల్లబజారుకు తరలించినా సహించేది లేదన్నారు. ప్రతి దుకాణదారుడు స్టాక్ బోర్డులను ప్రదర్శించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేసి, క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమములో వ్యవసాయ విస్తరణ అధికారులు ఏ ఈ ఓలు రచన, ధర్మేందర్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు.



లోకల్ గైడ్. ఖమ్మం.ఖమ్మం,నగరంలో 58వ డివిజన్ బిసి కాలనీలో ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సిసి డ్రెయిన్ల పనులకు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువాళ్ళా దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కనగల్ ఎక్స్‌రోడ్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహం ధ్వంసం ఘటనపై ప్రభుత్వ అధికారుల వైఫల్యాన్ని ఖండించిన బీజేపీ



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .లోకల్ గైడ్.నల్గొండ జిల్లా కనగల్ మండలం: కనగల్ ఎక్స్‌రోడ్‌లో రోడ్డు పనులలో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించే ప్రక్రియలో అధికారులు సంబంధిత కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా.... అజాగ్రత్త వహించడం వల్ల విగ్రహం ధ్వంసం కావడం అత్యంత బాధాకరమని భారతీయ జనతా పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తూ, విగ్రహాన్ని తొలగించే సమయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, పూర్తిస్థాయి విచారణ జరిపి కారకులైన వారిని సస్పెండ్ చేయాలని... సదరు కాంట్రాక్టర్ పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధ్వంసమైన విగ్రహం స్థానంలో వెంటనే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, మహనీయుల విగ్రహాల పట్ల ప్రభుత్వం , అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి పోతపాక లింగస్వామి , ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాకీ నరసింహ , దళిత మోర్చా రాష్ట్ర నాయకులు చింత ముత్యాలరావు , కనగల్ మండల అధ్యక్షులు బిక్షం , అలాగే బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణను వేగవంతం చేయాలి

- జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల.

- జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో రెవెన్యూ అధికారి సమీక్ష



మహబూబ్నగర్ జూలై 7 (లోకల్ గైడ్ ప్రతినిధి జీవి గౌడ్)ఆయిల్ పామ్ సాగు విస్తర్ణము పెంపుపై జిల్లా రెవెన్యూ అధికారి ఎ.నిర్మలా మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉద్యానవన, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, మైక్రో ఇరిగేషన్, ప్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జాతీయ వంటనూనెల మిషన్ -- ఆయిల్ పామ్ (చీవీజుూ-ూ్రా) పథకం కింద ఆయిల్ పామ్ సాగు విస్తరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గతములో, సాంకేతిక బృందం, భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ వారు మన జిల్లాలో 5,000 ఎకరాల ఆయిల్ పామ్ పంట వేయడానికి అవకాశం ఉన్నదని గుర్తించారు. అందులో ఇప్పటివరకు 4,782 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులోకి వచ్చింది ( 96 %). ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) గాను, 1,500 ఎకరాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 792 ఎకరాలకు (260 మంది రైతులకు) పరిపాలనా అనుమతులు లభించాయి. అయితే, అందులో 130 ఎకరాలలో (31 మంది రైతులు) ఇప్పటివరకు తోటలు నాటడము జరిగిందని, మిగిలిన లక్ష్యం సాధనకైక్షేత్రస్థాయిలో చర్యలు వేగవంతం చేయాలనీ అన్నారు.ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి (ణనూ) కె. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న భారీ సబ్సిడీలు, వివిధ రకాల రాయితీల పథకాలను సుదీర్ఘంగా వివరించారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ రైతులకు స్థిరమైన, ప్రతి నెలా గ్యారెంటీ ఆదాయాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సూక్ష్మ నీటి పారుదల (డ్రిప్) సదుపాయం, ప్రభుత్వ కొనుగోలు గ్యారెంటీ మరియు మొక్కల పెంపకానికి ఇచ్చే తోడ్పాటుతో ఆయిల్ పామ్ జిల్లా వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చబోతోందని అన్నారు. సాగు విస్తరణను మరింత వేగవంతం చేసేందుకు ఉద్యానవన అధికారులు (నూం) మరియు ఉద్యాన విస్తరణ అధికారులకు (ఎజూం) నియోజకవర్గాల వారీగా స్పష్టమైన డిపార్ట్మెంట్ లక్ష్యాలను ఆయన నిర్దేశించారు.అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి (ణూూ) గోవింద్ నాయక్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యపరచడంలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలన్నారు.అందుబాటులో నీటి వనరులు కలిగి ఉన్న రైతులను గుర్తించి, వారిని ఆయిల్ పామ్ వైపు మళ్లించే బాధ్యతను అసిస్టెంట్ అగ్రికల్చర్ డైరెక్టర్లు (ూణూం), మండల వ్యవసాయ అధికారులు (ూూం) మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు (ూజూం) తీసుకోవాలని ఆదేశిస్తూ వారికి ప్రత్యేక గ్రామాల వారీగా లక్ష్యాలను ఖరారు చేశారు.సహకార సంఘాల అనుసంధానంపై జిల్లా సహకార అధికారి (ణజూ) కృష్ణ మాట్లాడుతూ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ూూజూ) ద్వారా రైతులకు అవసరమైన ఆర్థిక సాయం, ఎరువులు మరియు పెట్టుబడి మద్దతును అందించేందుకు గల మార్గాలను వివరించారు. ఆయిల్ పామ్ రైతులకు ప్యాక్స్ నెట్‌వర్క్ ఎంతగానో తోడ్పడుతుందని చెబుతూ, ప్యాక్స్ సీఈఓ లకు సాగు నమోదుకు సంబంధించిన నిర్దేశిత బాధ్యతలను అప్పగించారు.సమావేశ ముగింపు సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి (ణ=ూ) ఎ. నిర్మల మాట్లాడుతూ, అధికారులు ఎవరూ వ్యక్తిగతంగా కాకుండా ఉద్యానవన, వ్యవసాయ, సహకార శాఖలు ఒకే తాటిపైకి వచ్చి సమన్వయంతో పని చేయాలని సూచించారు . ప్రతి వారం శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాల ప్రగతిని జిల్లా కలెక్టర్ గారు సమీక్షిస్తారని, రైతుల దరఖాస్తుల నమోదు నుండి డ్రిప్ పరికరాల అమరిక వరకు ప్రతీ దశలోనూ అధికారులు రైతులకు అండగా నిలవాలని స్పష్టం చేశారు. లాభదాయకమైన ఈ ఆయిల్ పామ్ సాగును జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమన్వయ సమావేశంలో జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు (ూణూం), వ్యవసాయ అధికారులు (ూూం), ఉద్యాన అధికారులు (నూం), వ్యవసాయ విస్తరణ అధికారులు (ూజూం), ఉద్యాన విస్తరణ అధికారులు (ఎజూం) మరియు వివిధ ప్యాక్స్ (ూూజూ) సొసైటీల సీఈఓ లు , డ్రిప్, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జూలై 12లోగా దరఖాస్తు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ కె. హైమావతి




లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 7: హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్, మెయిన్స్) ఉచిత శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.కలెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ, బీసీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించనున్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలలోపు ఉన్న అర్హులైన అభ్యర్థులు జూలై 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈ నెల 19న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో కూడిన రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.దరఖాస్తుల కోసం అధికారిక వెబ్ సైట్ లో చూడండి మరిన్ని వివరాల కోసం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందవద్దు... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం/ మధిర, జూలై -07:లోకల్ గైడ్ : జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో రైతులకు అవసరమైన మేరకు యూరియా, ఇతర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.మంగళవారం మధిర నియోజకవర్గంలోని దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఎరువుల గోడౌన్, విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో ఉన్న యూరియా, డీఏపీ, ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లలో నమోదైన వివరాలతో సరిపోల్చి తనిఖీ చేశారు. ఇప్పటివరకు వచ్చిన ఎరువుల పరిమాణం, రైతులకు పంపిణీ చేసిన బస్తాల సంఖ్య, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు, రానున్న సరఫరాల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, వానాకాలం సాగుకు అవసరమైన ఎరువుల నిల్వలు జిల్లాలో సమృద్ధిగా ఉన్నాయని, ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా బుకింగ్ యాప్ విధానం పారదర్శకమైన ఎరువుల పంపిణీకి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. జిల్లాతో పాటు మండలాల వారీగా యూరియా నిల్వల వివరాలు కూడా యాప్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.నానో యూరియా వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని, ప్రయోగాత్మకంగా కొంత విస్తీర్ణంలో ఉపయోగించి ఫలితాలను పరిశీలించాలని సూచించారు.వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు పంట అవసరానికి తగిన మోతాదులోనే ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించాలని రైతులను కలెక్టర్ కోరారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట ఆర్డీవో ఖమ్మం శ్రీనివాస్, మధిర తహసీల్దార్ రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\